# మూగమనసు

నీల కిటికీలోనుంచి రోడ్డు మీదికి దృష్టిపోనిచ్చింది. ఇంకా బండ్లు రోడ్డుమీద బాగా తిరగటంలేదు. ఒకటో రెండూ అప్పుడప్పుడు వస్తూ పోతున్నాయి. పొద్దెక్కుతున్న కొద్దీ వాహనాలరద్దీ, జనసమ్మర్దమూ, అలజడి.

నీల ఆవలించి తల వెంట్రుకలు చేతిగోళ్ళతో దువ్వుకుని గట్టిగా రిబ్బను కట్టింది. ఆ గదికి అనుకుని ఉన్న బాత్ రూములో ముఖం కడుక్కు వచ్చింది కుర్చీలో కూర్చుని మళ్ళీ కిటికీలో ముఖం పెట్టి చూడటం మొదలు పెట్టింది చురుకుగా ఆదుర్దాతో ఆశతో చూస్తున్న ఆమె కళ్లు ఒక గంట సేపటికి ఆ మెరుపుచు కోల్పోయి గాజు కళ్లలా కనబడుతున్నాయి. కొంత సేపటికి బరువుగా నిట్టూర్చింది విసుగుతో కనుబొమలు ముడుచుకుని కుర్చీ వెనక్కు లాక్కుంది.

ఎనిమిది గంటలయింది ఇంట్లో అందరూ అన్ని పనులలో మునిగి వున్నారు. నీల ఇద్దరు తమ్ముళ్ళూ ముఖాలు కడుక్కున్నారు. స్నానాలు చేశారు. స్కూలుకు వెళ్ళటానికి యూనిఫారమ్ బట్టలు వేసుకున్నారు. బూట్లు టకటక లాడించుకుంటూ తిరుగుతున్నారు. నీల చెల్లెలు కృష్ణ నీలి రంగు చీరె తెల్లబ్లవుజు - ఆమె స్కూలు యూనిఫారము వేసుకుని పుస్తకాలు చేతబట్టింది. ఆమె తొందరగా ఇంటినుంచి బయలుదేరుతుంది. బస్టాండు ఆ యింటికి కొంచెం దూరం. ఆ బస్సు తప్పితే మరో గంటకు గాని బస్సురాదు. అప్పటికి లేటవుతుంది.

నీలకు ఆరోజు సెలవు. ఆ క్రిందటి రోజు ఆమె స్కూల్లో పెద్ద మీటింగయింది. పార్లమెంటు సభ్యుడు స్కూలు విద్యార్థులకు బహుమతులు పంచాడు. కనుక మరునాడు సెలవు ప్రకటించారు.

పిల్లల హడావిడి అయిన తరువాత నీల బద్ధకంగా లేచి స్నానం చేసింది. ఇంటి పనులలో తల్లికి సహాయంచేసి మామూలుగా భోజనం చేసింది. ఏం చెయ్యాలో తోచక మళ్ళీ కిటికీ దగ్గరగా వున్న కుర్చీ మీద కూర్చుంది.

పనులన్నీ చేసుకుని తల్లి అనసూయమ్మ వచ్చింది.

"నీలా! రాముా బుష్‌షర్టు రిపేరుచేసి గుండీలు కుట్టిపెట్టవూ? నేను ఉతికి ఇస్త్రీ చెయ్యాలి సాయంత్రానికి. మళ్ళీ నీకు రేపు స్కూలు ఉంది. తీరుబడి ఉండదు" బుష్‌షర్టూ గుండీలు వేసిన డబ్బా సూదీదారం తెచ్చి పక్కన పెట్టింది.

సాయంత్రం కుడతానన్నట్లు చెప్పింది నీల. అనసూయమ్మ నీల వైపు దీర్ఘంగా చూచి వీపుమీద తట్టి లోపలికి వెళ్ళింది.

నీల అందాన్ని ఆమె తనివితీరా చూసుకుంటుంది. తొలి చూలు మీద ఎంతో మమత తల్లికీ తండ్రికీను. కాని- ఆమెను చూసిన తరువాత కడుపులోఉన్న కొండంత బరువు మరింత బరువవుతుంది.

నీల ఒక కాన్వెంట్ స్కూల్లో పనిచేస్తోంది. టైపిస్టు పనీ, లైబ్రరీ పనీ, స్టోర్సుపనీ చేస్తుంది. చేసిన పని చాలా చాకచక్యంతో చేస్తుంది. నిశితంగా పరిశీలించి చేస్తుంది. ఎవరూ తప్పుపట్టలేనట్టుగా చేస్తుంది. ప్రార్థనకు పియానో మీద పాటలు వాయిస్తుంది. ఆమె ఆ స్కూలు ప్రిన్సిపల్‌కు తలలో నాలుక- మనసులో మనసు.

నీల సలహాలమీద ఆ ప్రిన్సిపల్ ఆ స్కూల్లో ఎన్నో మార్పులు తెచ్చింది. ఆంగ్లో యిండియన్ మిస్ రాబర్టుకు పుట్టకపోయినా నీలనూ ఆమెనూ తల్లీ కూతుళ్లేనంటారు అందరూ. వాస్తవానికి ఆమె ప్రిన్సిపల్ ఆ స్కూలుకు. నీల ఒక ఉద్యోగిని.

నీలను ఆ స్కూలు టీచర్లంతా గౌరవిస్తారు. తోటమాలి దగ్గర్నుంచి నౌకర్లందరూ చెయ్యెత్తి దణ్ణంపెడతారు. ఆమె అందరినీ పలకరించినట్టుగా చిరునవ్వుతో తలాడిస్తూ ఉంటుంది.

అందరూ ఆమెపట్ల చూపించే గౌరవంలో, ప్రేమలో జాలి ఏభయి శాతం.

అయిదారు సంవత్సరాల క్రిందట ఆ స్కూల్లో బహుమతులు పంచిపెట్టటానికి విద్యాశాఖ కార్యదర్శి వచ్చాడు. ప్రిన్సిపల్ స్టాఫ్‌కంతకూ ఆయనను పరిచయం చేసింది. అందరికంటె నీలను ముందుగా పరిచయం చేస్తూ "ఈమె మా స్కూల్లోనే ఎ, బి, సి, డి లు నేర్చుకుంది. ఇక్కడే మెట్రిక్ పాసయింది. ఈమె నా పెంపుడు కూతురు. ఇక్కడే ఒక ఉద్యోగం ఇచ్చాను. ముగ్గురు చేసేపని ఒక్కర్తే చేస్తున్నది. మంచి సమర్థురాలు" అన్నది.

ఆయన చిరునవ్వుతో నమస్కారంచేసి అట్లాగా అన్నట్టు చూశాడు.

ఆమె ప్రతి నమస్కారం చేసింది.

ప్రోగ్రామ్ జరుగుతుండగా ప్రిన్సిపల్ విద్యాశాఖ కార్యదర్శికి మెల్లగా నీలను గురించి చెప్పింది. "నీలకు పదవఏట టాన్సిలు్స ఆపరేషను జరిగింది. అప్పటినుంచి మాటమాట్లాడితే అస్పష్టంగా ఉంటోంది. ఇదే దిగులు అందరికీ. పాతిక సంవత్సరాలయినా తల్లిదండ్రులు పెళ్ళి మాట తలపెట్టలేక పోతున్నారు" అంది.

నీలకు ఎవరు ఏమి మాట్లాడుతున్నా తనను గురించేమోనన్న అనుమానం. ఆ అనుమానంతో ఏవోఏవో ఊహించుకుని క్రుంగిపోతుంది.

కాని- ఆనాడు ఇంటికి వచ్చి మెట్లు ఎక్కుతుండగా ఆమెకు ఆనంద్ ఎదురయ్యాడు. ఆమె అతడు వెళ్లేవరకూ అక్కడే నిలబడి ఆ తరువాతనే మెట్లు ఎక్కింది.

ఆనంద్ ఆమెనే చూస్తూ మెట్లు దిగాడు. ఆమె పైకి ఎక్కుతుంటే వెనక్కి తిరిగి చూశాడు. ఆమె పై మెట్టు ఎక్కేవరకూ నిలబడ్డాడు. ఎందుకో ఆమె వెనక్కి తిరిగిచూడగానే నవ్వుతూ కనబడ్డాడు.

ఆమె గిరుక్కున తిరిగి లోపలికి వెళ్ళిపోయింది.

"ఆయన ఎవరమ్మా? ఎందుకు వచ్చాడు? ఏం కావాలట?" చిన్న తమ్ముడు తల్లిని అడుగుతున్నాడు.

"ఆ అబ్బాయా! అతడు వకీలు చంద్రయ్యగారి కొడుకు. ఢిల్లీలో ఆలిండియా రేడియోలో పని చేస్తున్నాడు. బాగా పాటలుకూడా పాడ తాడు." ఆమె పనిలో మునిగిపోయింది.

"మనింటికి ఎందుకొచ్చాడంటే?" రామూ మళ్ళీ అడిగాడు.

"నాన్నగారి దగ్గర్నుంచి ఏదో పుస్తకం తీసుకువెళ్లాడట. ఇవ్వ టానికి వచ్చాడట!"

నీల అతడిని గురించి పూర్తిగా విన్నది. ఆమెకు ప్రిన్సిపల్ తనను గురించి విద్యాశాఖ కార్యదర్శితో చెప్పినప్పటినుంచీ గుండె బరు వుతో కొండంత భారమయింది. ఆ భారాన్ని గురించి ఆలోచించకుండా ఇదివరకూ ఉండలేక పోయేది. కాని- ఆ క్షణాన అంత బరువనిపించలేదు కాబోలు- చంగుచంగున ఎగిరి గంతులు వేయాలనిపిస్తోంది ఆమెకు.

ఆమె హృదయంలో ఒక చిన్న కిటికీ అస్పష్టాకారంలో తెరుచు కున్నట్టయింది.

# 2

నీలకు సెలవు వచ్చిందంటే కాంతిపుంజాలవంటి కళ్లు బాగా విప్పుకుని కిటికీకి దగ్గరగా కూర్చుంటుంది. ఆ దారిన వెళ్ళేవాళ్ళను నిశితంగా చూస్తుంది

ఒకసారి జనసమ్మర్దంలోంచి ఒక స్కూటరు దూసుకుపోతోంది. నీల విశాల నయనాలు మరింత విశాలమయ్యాయి. తత్తరపాటుతోలేచి ఆ స్కూటరు కనుమరుగై పోయేవరకూ చూసింది.

ఆ మరునాడు- ఆ మరునాడు-ఆ స్కూటరు ఆ వేళకు ఆ దారిన పోతూ ఆమెకు కనబడ తూ వచ్చింది. అది చూడగానే ఆమె మనసు పిల్లిగంతులు వేయటం నేర్చుకుంది. మెల్లమెల్లగా ఆమె మనసులోని కవాటం స్పష్టమై తెరచుకోవటం మొదలు పెట్టింది. ఆ తెరచుకోవటం తరువాత మరి మూతపడలేదు.

స్కూటరుమీది యువకుడు ఆ కవాటం దగ్గర నిలబడ్డాడు. చూస్తాడు- ఆ యింటివైపు తళతళలాడే కళ్ళతో.

కొద్దిరోజులనుంచీ అతడు ఉదయం పదిగంటల వేళ ఆ దారిన వెళ్ళటం, సాయంకాలం నాలుగున్నర ఐదు గంటలవేళ తిరిగి రావటం జరుగుతోంది.

నీల స్కూలుకు వెళ్లే వేళ పొద్దున తొమ్మిదిగంటలు. ఇంటికి వచ్చేసరికి సాయంత్రం ఐదుగంటలవుతుంది. మూడున్నరకు స్కూలు వదలి పెట్టినా అన్నీ సర్దుకుని తాళాలు వేసి నీల బయట పడటానికి ఒక గంట పడుతుంది. బస్సు దొరికి ఇంటికి వచ్చేసరికి ఆవేళవుతుంది. ఎంత సేపున్నా ఎవరు ఎంత విసిగించినా నీల నిండిన గుండెతో ఇనుమడించిన

ఉత్సాహంతో పని చేసుకుపోతోంది. ఎప్పటి కంటె చురుకుగా సాగుతోంది పని.

"లోలోపల మూలిగే నా నీరస మేమయిందిప్పుడు ?" అనుకుంటుంది నీల. కళ్లు మూసుకుని గుండె మీద చెయ్యి వేసుకుని నిండుగా గాలి పీల్చుకుంటుంది.

రాత్రిళ్లు త్వరగా నిద్రపట్టదన్న బాధలేదు. ఏ కాస్త సమయం దొరికినా ఆ స్కూటరువాలా ఆమె దృష్టి పథంలోకి వచ్చి నడుంమీద చెయ్యి పెట్టుకుని నిలబడతాడు. చిలిపి నవ్వులు నవ్వుతాడు. కొంటెగా చూస్తాడు. తల ఒరగపెట్టి పలకరిస్తాడు.

కాని అతడు పగటివేళ స్కూటరుమీద వస్తూనోపోతూనో ఆమెకు కనబడటంలేదు.

ఒక సాయంత్రం తమ్ముడు తల్లితో చెబుతున్నాడు. "అమ్మా, వాళ్ల ఆనందుకు ఈ ఊళ్లో ఉద్యోగమయిందిట. నాతో చెప్పాడు."

అందుకా తనకు కనబడటంలేదు ఉద్యోగమయితే తనకూ అతడికి టైము ఒకటే వెళ్లటానికీ రావటానికీను. ఇంకెట్లా కనబడతాడు ? నీలకు తల గిరగిర తిరిగినట్లయింది.

నీల స్కూల్లో ఇంగ్లీషు టీచర్ చంపకం వయొలిన్ అద్భుతంగా వాయిస్తుంది. నీలకు కర్నాటక సంగీతం కొంతవరకూ వచ్చు. చంపకం తనవయొలిన్ స్కూల్లో ఒక కబోర్డులో పెట్టుకుని తాళం వేసుకుంటుంది. ఆ స్కూలు ఆవరణం చాలా పెద్దది. చెట్లు ఏపుగా పెరిగి వృక్షాలయ్యాయి. కొన్నిటికి చెట్ల కొమ్మలు కిందికి వాలి గుబురుగా పెరిగాయి. ఆ చెట్ల క్రింద కూర్చుని ఆమె తనకు తీరిక ఉన్నప్పుడు వయొలిన్ వాయించుకుంటుంది. ఆమె ముగ్గురు పిల్లలతల్లి. ఉమ్మడి కుటుంబంలో సంగీత సాధ

నకు చోటులేదు, పీలూ ఉండదు. అందుకని ఆ చెట్లకింద, స్కూలు పిల్ల లకు దూరంగా, ఒక్కతే కూర్చుని హాయిగా వాయించుకుంటుంది. వయొలిన్ మీద కమాను తిరుగుతుంటే ఆమె కళ్లు వాటంతటవే మూసుకుపోతాయి. మనసు గాలిలో ఎక్కడికో పైపైకి పోయి విహరిస్తుంది. ఒకనాడు వయొలిన్ ధ్వని గది బయటికి వచ్చి నిలబడ్డ నీలకు వినబడ్డది. ఐదు నిమిషాలలో నీల తను అచేతనురాలయిందని గ్రహించింది.

ఆమె కాళ్లు చంపకం కూర్చున్న చెట్టు దగ్గరికి దారితీశాయి వెళ్ళి చంపకం దగ్గరగా నిలబడ్డది.

రఘువంశ సుధాంబుధిచంద్రశ్రీ

ఫిడేలు తీగెలపైన కమాను గంతులు వేస్తున్నది. రాగం తీగెలు తీగెలుగా సాగుతున్నది. అరమోడ్పు కళ్ళతో చంపకం ఆ గానంలో లీనమైపోయింది.

తాళగతులతో పైకిపోయిన రాగము క్రమంగా క్రిందికి దిగి వచ్చింది.

పాట అయిందన్నట్టుగా కమాను పొడుగ్గా సాగింది.

"చంపకం!" అన్నట్టు గొంతులోనుంచి ధ్వని బయటికి వచ్చింది.

"ఓ నీల! ఎంతసేపయింది వచ్చి ?" ఫిడేలు భుజమ్మీదనుంచి తీసి, కాలుచాపి ముడుచుకుంది మందహాసం చేస్తూ.

నీల అందరితోనూ మాట్లాడదు. ఒకవేళ మాట్లాడటానికి ప్రయత్నించినా ఎవరికీ తెలియదు. అందుకని కాగితమ్మీద వ్రాసి చూపిస్తుంది. చంపకానికి కూడా కాగితమ్మీద వ్రాసి చూపించింది.

"ఇంత బాగా నీకు సంగీతం వచ్చునని నాకెందుకు చెప్పలేదు ?"

"సందర్భం రాలేదు కనుక చెప్పలేదు" చంపకం తన పక్కకు వచ్చి కూర్చొమని నీలకు సైగ చేసింది.

"నాకు కొన్ని వర్ణాలూ కృతులూ వచ్చు. కాని ఈవాద్యం రాదు. నాకు ఫిడేలుమీద వాయించటం నేర్చుకోవాలని ఉంది. కాని......" తలవంచుకుంది నీల.

"ఎందుకని? తీరికలేకనా?" అడిగింది చంపకం.

"కాదు—కాదు" కాగితంమీద వ్రాసింది నీల.

నీల అంటే అందరికీ చెప్పలేనంత అభిమానం. నీలపట్ల అభిమానంతోపాటు ఆరాధన కూడా ఉంది చంపకానికి. నీల భుజంమీద చెయ్యేసింది ఆప్యాయంగా చంపకం.

"అదేమిటి? కన్నీళ్లెందుకు? నేనడిగిన ప్రశ్న నిన్ను ఇంతగా బాధించిందా?" చంపకం నొచ్చుకుంది.

"నాతో చెప్పవా? మన స్నేహం ఇంతేనా?" బ్రతిమిలాడింది చుబుకం పట్టుకుని.

"అందరితోనూ ముందుగా నా దురదృష్టాన్ని గురించి చెప్పకోవాలి. వాళ్ళకు నా మీద సానుభూతి ఉంటేగాని చెప్పను." తల వంచుకుంది నీల కాగితం చంపకానికి చూపిస్తూ.

"అందుకా ఇంత బాధపడుతున్నావు? నీకు కొంత వచ్చు కదా? నేను నేర్పుతాను. నేర్చుకోటానికి నాదగ్గర మరొక ఫిడేలు ఉంది. రేపు తెస్తాను. చూడు. నీకూ నాకూ తీరికవున్న వేళల్లో చూపిస్తాను ప్రాక్టీసు చెయ్యి" నీల వీపు నిమురుతూ చంపకం చెప్పింది.

చిన్నపిల్ల మాదిరిగా తలతిప్పి కళ్లు తుడుచుకుంది నీల సరేనన్నట్టుగా.

ఆ తరువాత రెండు కృతులు వాయించింది చంపకం నీలను దగ్గర కూర్చోబెట్టుకుని. చంపకం పాడుతున్నంతసేపు నీల ఆమెనే చూస్తున్నది. ఆమె పరవశంతో పాడుతున్నది. ఆమె రసమయ జగత్తులో తేలిపోతోంది.

గానంలో ఇంత భక్తి పారవశ్యమా?

నీలకు గుండె పొంగినట్లయింది.

ఆ మరునాటి నుంచీ ఒక గంటసేపయినా చంపకం దగ్గర కూర్చోనిదే ఇంటికి వచ్చేదికాదు. ఆ మరుసటి నెలలోనే ఒక సెకండ్‌హాండ్ ఫిడేలు అమ్మకానికి వచ్చిందని చంపకం చెప్పగానే కొని యింటికి తీసుకు వచ్చింది.

రాత్రి అందరూ పడుకున్న తరువాత చంపకం నేర్పిన కీర్తనను సాధనచేస్తూ ఉండేది.

"నీవు ఇంగ్లీషు మ్యూజిక్ నేర్చుకున్నావుకదా! నీ కదిష్టమా? ఇది ఇష్టమా?" అడుగుతూ ఉండేది చంపకం.

"ఎంతని చెప్పను? కర్నాటక సంగీతం ప్రాణమై పోయింది." వ్రాసి చూపిస్తుంది నీల ముసిముసి నవ్వులు నవ్వుతూ.

నాలుగురోజుల క్రితం రాము చెప్పాడు "అక్కా! ఆనంద్‌గారు రాత్రి రేడియోలో పాటపాడతారట" అన్నాడు.

వెంటనే తల్లి అన్నది "తండ్రి ఇక్కడ బ్యాంకులో ఉద్యోగ మిప్పించాడట. రేడియోలో ఉద్యోగం మానేసి ఢిల్లీనుంచి వచ్చేశాడట."

ఆ రాత్రి ఐదు నిమిషాలకు ముందే రేడియో దగ్గర చేరారు పిల్లలు. తీగెలు సాగిన ఆ కంఠధ్వని అరగంటసేపు లలిత సంగీతం పాడింది.

ఎంత బాగుందా కంఠధ్వని! ఎంత బాగా పాడాడు! అతడి మూర్తే కాకుండా అతడి గానం కూడా ఆమె హృదయంలో చోటు చేసుకుంది.

అతడికి గానమంటే ఇష్టం కనుక తను సంగీతంలో నిధి కావాలి. అది ఆమె ఏకైక లక్ష్యంగా మారింది.

"నీలా నీవు నన్ను మించిపోతున్నావు సంగీత సాధనలో. నాకంటే బాగా పలికిస్తున్నావు ఫిడేలును." చంపకం అభిమానంతో భుజమ్మీద తడుతుంది.

"గురువుగారికి శిష్యురాలు తనను మించిపోతుందన్న భయంలేదు కదా ?" కొంటెగా నవ్వుతూ తను వ్రాసిన కాగితం చూపించింది నీల.

ఇద్దరూ నవ్వుకున్నారు.

చంపకం మెచ్చిన తన ఫిడేలు మీది పాటను ఆనంద్ వినే అవకాశం ఉందా ? ఉంటే ఎంత బాగుండును ? తన ఫిడేలు వాద్యసాధన అతడు వింటే ....వింటే తన జన్మ తరించినట్లే.

కిటికీకి దగ్గరగా కుర్చీ లాక్కుని, కిటికీలో తల వుంచి, ఆ వేళకు స్కూటరు రాదని తెలిసినా దానికోసం గంటలకొద్దీ ఎదురుచూడటానికి ఇప్పుడు నీలకు తీరికలేదు. తన గానంతో అతడిని పిలుస్తున్నది. వస్తాడు, వస్తాడు అనుకుంటుంది.

## 3

"నీవు చెప్పినమాట నా మనసులో ఉంది. ఎదిగిన ఆడపిల్లలు ఇంట్లో ఉన్నట్టు నాకు తెలియదా ? నేను కంటిముందర తిరుగుతున్న

పిల్లలను చూడటంలేదా? నీవు పైకి అని గొడవు చేస్తావు. నేను మన సులో పెట్టుకుంటాను. అదే తేడా మనిద్దరికి" అంటాడు నీల తండ్రి రంగారావు భార్యతో.

"చూస్తునే ఉన్నానంటారు. చూసి లాభం ఏమిటి? చురుకు పుట్టాలి. పిల్లలకు పెళ్ళి చెయ్యాలన్న ఆవేదన కలగాలి. పదిమంది చూడాలి. పదిమందితో చెప్పాలి." చురుక్కు మనేటట్టు అన్నది నీల తల్లి అనసూయమ్మ.

"ఆ సంగతి నన్ను చెప్పనిస్తావా? నేనెంత మందిని చూస్తున్నానో? ఎందరికి సంబంధాల సంగతి చెప్పానో నన్ను చెప్పనివ్వు."

నోరు తెరచి బుగ్గలు నొక్కుకున్నది. అనసూయమ్మ.

"కాలేజీలో ఫిజిక్సు లెక్చెరరు రాజగోపాల్ అని ఉన్నాడట. మనిషి బాగుంటాడట. అమ్మాయికి ఈడైన వాడేనని చెప్పాడాక స్నేహితుడు. ఈ సాయంత్రం వెళ్ళి చూసి వస్తాను. అతడి స్థితిగతులు కూడా మనకు తగినట్టే ఉన్నాయని విన్నాను."

అనసూయమ్మ సంతోషించింది. ఈ సంబంధం కుదిరితే త్వరగా నీలకు పెళ్ళి చెయ్యాలి. వచ్చే ఏడాదికయినా కృష్ణకు చెయ్యవచ్చు.

కృష్ణను గురించి ఆమె కీమధ్య గుండె గుబగుబలాడుతున్నది.

కాలేజీలో ప్రవేశించిన తరువాత సాయంత్రపువేళ త్వరగా ఇంటికి రావటంలేదు. అడిగితే ఏదో సాకు చెబుతుంది. ఇంటినుంచి వేళకాని వేళలో బయటికి వెళుతూ ఇప్పుడే వస్తానంటుంది. ఇంటికి విద్యార్థులు వస్తూ ఉంటారు. "వాళ్లు నా క్లాస్‌మెంట్సు" అంటుంది. ఆ కబుర్లూ ఆ నవ్వులూ తనకు నచ్చటంలేదు. ఆమె నోరు తెరచీ తెరవకముందే వెయ్యి చదువు తున్నది స్వేచ్ఛను గురించి కృష్ణ.

అంతటితో అనసూయమ్మ నోరు మూత పడుతుంది. మరీ కఠినంగా ఉంటే ఎదురు తిరుగుతుందని భయం. చెయ్యి జారిన తరువాత అనుకుంటే ఏం లాభమనుకుంటుంది.

ఆ రాత్రి రంగారావుగారు భోజనాలు చేసేటప్పుడు చాలా సరదాగా మాట్లాడారు. నీలవంక చూస్తూ "నా తల్లికేం తక్కువ?" అంటూ మనసు లోనే సంతోషించారు.

"ఏమండీ అనసూయమ్మగారూ! ఆదివారం సాయంత్రం నా స్నేహితులిద్దరు కాఫీ వేళకు వస్తారు. కొంచెం మంచి టిఫిన్ కాఫీ చేస్తారా?" అన్నారు, భార్య వంక తిరిగి.

పిల్లలంతా ఆమాటలకు నవ్వారు.

ఆ రోజు పిల్లలందరూ ఇంట్లోనే వున్నారు. రాము గది శుభ్రంగా దులిపి కుర్చీలు వేశాడు. వాజులోవున్న ప్లాస్టిక్ పూలను బాగా కడిగి పెట్టాడు కుషన్లకు కవర్లు మార్చాడు ఇదంతా చూసి కృష్ణ విరగబడి నవ్వింది.

"కృష్ణక్కా. నాన్న గదిలోనే వున్నారు. ఊరికే నవ్వకూ!" పెద వులు సాగదీసుకుంటూ వెళ్ళిపోయింది కృష్ణ.

రాజగోపాల్ తన స్నేహితుడితో లోపలికి వచ్చినప్పుడు అందరూ, ఆ గదిలోనే వున్నారు. తండ్రి చెప్పగానే నీల కృష్ణ కాఫీ టిఫిన్లు తీసుకు వచ్చారు.

రాజగోపాల్ కాఫీ తాగుతూ రంగారావుగారు పరిచయం చేసిన ఆయన పిల్లలందరినీ ఒకసారి చూసి నీల ముఖంమీద దృష్టి నిలిపాడు. ఆమె కళ్లు దించుకుని కూర్చుంది. ఆమె అందం అతడిని ఆకర్షించింది. ఆమె ముఖం చాలా గంభీరంగా ఉన్నట్టు కనబడ్డది. కృష్ణ, అక్క అంత సౌందర్యవతి కాకపోయినా, చాలా చురుకుగా ఉన్నట్లనిపించింది.

తండ్రి రంగారావుగారు నీల చదువు, ఉద్యోగం, సంగీతాన్ని గురించి చెప్పారు.

అరగంట కూర్చుని స్నేహితులిద్దరూ కబుర్లు చెప్పారు. వాళ్లు లేచి వెళ్ళగానే నీల తన పనిమీద లేచి వెళ్ళిపోయింది. మిగతా వాళ్లందరూ కూర్చుని వరుడు రాజగోపాల్‌ను గురించి ఒక గంటసేపు మాట్లాడుకున్నారు.

"అందరూ మాట్లాడేరు కాని, నీలక్క నోరు తెరవలేదు" అన్నాడు రాము.

మళ్ళీ కృష్ణ నవ్వింది

తల్లి ఆమెను మందలించింది. తండ్రి మనసు చురుక్కుమన్నది.

ఆ రాత్రి పిల్లలు పడుకున్న తరువాత అనసూయమ్మ "మీరు అతడితో నీల సంగతి చెప్పారా?" అన్నది.

"చూసి వెళ్లాడు కాని, ఇంకేమీ అనలేదుకదా! అక్కడి నుంచి కబురు వస్తే చెప్పవచ్చులే" అన్నారు. పిల్ల నచ్చితే ఈ చిన్న లోపాన్ని అతడు పట్టించుకుంటాడా అని ఊహించుకుంటున్నాడు.

"మనం ఉన్న లోపమేమిటో చెబితే అప్పుడు అతడికి నచ్చిందంటే మనం ముందడుగు వెయ్యొచ్చు. ఈ లోపం ఉందని ముందరే చెబితే అతడికి నచ్చకపోవచ్చు. మీరే రేపు వెళ్ళి ఈ సంగతి చెప్పండి" ఆమె బాధతో ముఖం అటు తిప్పుకుని అన్నది.

తెల్లవారిన తరువాత కృష్ణ "అక్కా! నిన్న మనం కాఫీ, టిఫిన్ ఇచ్చాం చూడు, అతడు నీకు కాబోయే వరుడు. నచ్చాడా?" అన్నది.

నీల కృష్ణతో మాట్లాడదు- సాధారణంగా. కృష్ణకు అక్క అంటే కొంచెం హేళన. ఏ మాత్రం సానుభూతి చూపించదు అందుకనే కృష్ణ మాట్లాడించినా బదులివ్వదు.

"నీవు మెచ్చావా? అతడిమాట అట్లా ఉంచు నీ సంగతి చెప్పు?" కృష్ణ మళ్ళీ రెట్టించింది. ఆమె మాటల్లో అతడెట్లాగయినా నీలను మెచ్చా డన్న భావం కొట్టవచ్చినట్టుగా వుంది.

చివాలున లేచి వెళ్ళిపోయింది నీల.

కృష్ణ పకాలున నవ్వింది.

ఆ రాత్రి శయ్య చేరిన నీలకు నవ్వుతున్న ఆనంద్ ముఖం ఎత్తని అవనిక లాగయింది.

అతడి నవ్వు తలచుకోగానే ఆమెకు గిలిగింతలు పెట్టినట్టయింది. ఆమెలో నూతనోత్సాహం పొంగులు వారింది. తనువెల్లా పులకరించింది. ఏవేవో ఊహలు ఆమెనెక్కడో విహరింపచేశాయి.

కాని, మనసులో ఏ మారు మూలనో రేఖామాత్రపు నిస్పృహ, తీరని కోరిక. అప్పటినుంచి ఇప్పటివరకూ మళ్ళీ ఆనంద్‌ను చూడలేదు.

ఒక్కసారి అతడిని చూడాలన్న కోరిక ఆమెను నిలువెల్లా దహింప చేస్తున్నది.

అతడిని కలుసుకోవటం సులభమే. అతడెక్కడ పని చేస్తున్నాడో తనకు తెలుసు. వెళ్ళి కలుసుకోవటం ఏమంత కష్టం కాదు. కలుసుకుంటే అతడు మాట్లాడడా? పలకరిస్తే మాట్లాడని వాళ్లుంటారా? అయితే వెళ్ళి ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి?

ఏం ఎలా మాట్లాడాలని అనుకోవటమేమిటి? తెలివి తక్కువతనం కాకపోతే? వెళ్ళి నేను బ్యాంకులో ఎక్కౌంటు పెట్టుకోవాలని అడగ కూడదా? అడిగేకదా అందరూ ఎక్కౌంటు పెట్టుకునేది? అయితే ఇంకో పరిచయమడుగుతారు. అడిగితే తను చెప్పలేదా? అతడినే సంతకం పెట్ట మనవచ్చు. అంతకంటె తెలిసిన వాళ్ళెవరుంటారు? అయినా అడగకుండా

వెళ్ళగానే అతడే పెట్టేస్తాడేమో? ఆఁహఁ. అడక్కపోతే అమర్యాదగా వుంటుంది. వినమ్రతతో "కొంచెం సహాయం చేస్తారా?" అని అడగాలి.

అవును. అడగాలి. కాని, ఎట్లా అడగటం? ఆమె తన గొంతును రెండు చేతులతో తడిమిచూసుకున్నది. అంతలోనే ఆమె గుండెమీద కొండంత బరువు పడినట్లయింది. అయ్యో! ఈ గొంతు సరిగా పనిచేస్తే ఇంక కావలసిన దేమున్నది? గొంతు పలకకనేగదా తను వ్రాసి చూపించవలసిన కర్మ పట్టింది? అందుకేగా తను ముందుకు రాకుండా వెనక ఉండవలసిన గతి పట్టింది?

కళ్లల్లో భావాలు చూడవచ్చునంటారు. కళ్లతో మాట్లాడవచ్చునంటారు. లీలామాత్రంగా గ్రహించగలరుగాని నోటి మాటలోని ఆ పొంగు, ఆ ఉద్రేకం, ఆ ఉత్సాహం దేనికి వస్తుంది?

తనకు తెలుసు దేనికీరాదని. చిన్నతనమైనా తనకు బాగా జ్ఞాపకం. తను మాట్లాడితే ముద్దొస్తుందని స్కూల్లో టీచరనేది తల్లి సరేసరి. తండ్రి రాత్రి భోజనాలయిన తరువాత తనను దగ్గర కూర్చోబెట్టుకుని ఊరికే మాట్లాడిస్తూ ఉండేవాడు. కథలు చెప్పించుకునేవాడు. పాటలూ, పద్యాలూ వినిపించమనేవాడు. నీ నోట్లో ఏముందమ్మా ఇంత తియ్యగా మాట్లాడతావు?" అనేవాడు. ఆ మాటలకు లేచి గంతులు వెయ్యాలనిపించేది తనకు. కొండశిఖరాగ్రాన కూర్చున్నట్లనిపించేది.

తన గొంతిప్పుడు మూగపోయింది. తన మనసులోని మాటను పైకి చెప్పలేదు తను నోరు తెరిస్తే ఏదో వికృత మయిన ధ్వని తప్ప మాటరూపంలో వెలువడదు తనకు మాటరాదు, మూగది అంటారు.

తన మూగతనం ఎటువంటిది? మాటల మాధుర్యాన్ని, మాటల సంతోషాన్ని, మాటలోని ఆనందాన్ని అనుభవించిన మూగతనం. ఇదే వ్యథ, మనసుకు కోత, చిత్రవధ, గుండె నిస్పృహ.

తెల్లవారుతున్నదని గడియారం టంగుటంగుమని ఐదు గంటలు కొట్టేవరకూ ఆమెకు తెలియనే తెలియదు. ఆలోచనల నిచ్చెన ఎక్కటం, పాము నోట్లోబడి కిందికి జారటం, మళ్ళీ నిచ్చెన ఆ ప్రాంతంలో ఎక్కడ యినా ఉందేమోనని కళ్లు చికిలించుకుని చూడటం, కనుచూపుమేరలో లేక పోతే దిగాలు పడటం ఇదే. ఇదే.

"అమ్మా. నీలూ! లేచావా ? పాలు కాగాయి. కొంచెం కాఫీ కలిపి అందరికీ ఇవ్వవూ ? నాన్న ఎదురుచూస్తున్నారు." తల్లి పిలుపుతో బాధ్యత లేవదీసి కూర్చోబెట్టింది.

నీల ఊహల తీగెలను తెంచుకుంటూ పక్కకు తొలగించుకుంటూ లేచి కూర్చుని. తలవెంట్రుకలను చేత్తో సవరించుకుని "ఆఁ. వస్తున్నా" అన్నట్టు కేక పెట్టి లేచింది వెనక్కు తిరిగి ఒక్కసారి పడకను చూసు కుంది. "ఛీ. వెధవ పడక. దీనిమీద పడుకుంటే ఎన్నో వెర్రిమొర్రి ఆలో చనలు. ఇంక దీని ముఖం చూడకూడదు" అనుకుంది.

ఆ సమయానికా తెగింపు ఎంతో హాయి నిచ్చింది.

సన్నటి నడుము చుట్టూ కొంగు తిప్పి దోపుకుని, చకచక నడిచి, చేతికందిన పని తలవంచుకుని చేస్తుంటే మనసు కదొక ఊరడింపుగా వుంది.

కాఫీ అందుకున్న తండ్రి "నీలూ! కళ్ళెర్రగా ఉన్నాయేమిటి ? ముఖం ఉబ్బరించిందెందుకు ? రాత్రి నిద్రపోలేదా ?" అడిగాడు ఆమె భుజం పట్టుకుని నిలుపుచేస్తూ.

నాన్నకెట్లా తెలుసు తన సంగతి ? విస్మయంతో, పట్టుబడిన దొంగలా అంతట్లోనే తలవంచుకుని కాదన్నట్టు తల ఊపింది.

ఆయన దీర్ఘంగా, ఆమె ముఖంలోకి చూసి, వీపుమీద తట్టి ముందు గదిలోకి వెళ్లాడు.

ఏమిటి నాన్నకు తెలుసా తన మానసిక క్షోభ?

ఓ నిముషం సేపు తొట్రుపాటు.

ఆ రోజు చంపకం ఒక కొత్త కృతి నేర్పింది. ఆమెతో పాటుగా నీల ఆ కృతి వాయించింది ఫిడేలు పైన.

"సాధన చెయ్యి" చంపకం ఫిడేలు తీసి పెట్టెలో సర్దింది

"ఓహో! నీవు కూడా ఫిడేలు సాధన చేస్తున్నావా నీలా?" భుజం తట్టింది వరండాలోకి అప్పుడే కాలు పెట్టిన ప్రిన్సిపాల్ నీలను చూసి.

నోరు తెరచి ఆఁ ఆఁ అన్నది నీల.

## 4

నీలతో స్కూల్లో సన్నిహితంగా ఉండేది సుగుణ. ఆమె అక్క సీమంతిని పనిచేసే స్కూలుకు సుగుణతో నీల వెళ్ళింది.

అది మూగబధిరాంధుల పాఠశాల. అంధులు చదువు నేర్చుకుంటున్నారు. ఎట్లా?

చెవిటివాళ్లు టీచరు చెప్పిన పాఠాలు తెలుసుకుంటున్నారు. ఎలా?

మూగవాళ్లు మాటలు నేర్చుకుంటున్నారు. ఏవిధంగా?

సుగుణ తన అక్క స్కూల్లోని వింతలూ విశేషాలూ వివరించి చెబుతోంది.

అంధులు అక్షరాలనూ, అంకెలనూ చేత్తో తడిమిచూసి గ్రహించ గలుగుతున్నారు. అదొక ప్రత్యేకమయిన కాగితము. దానిమీద అక్ష

రాలూ, అంకెలూ ఎత్తుగా పైకి లేచి ఉంటాయి. అంధులు చేతితో మితడి గ్రహించగలుగుతున్నారు. అది బ్రైల్ భాష లిపి.

చెవిటివారు మైక్రోఫోను చెవికి తగిలించుకుని పాఠం వినగలుగుతున్నారు.

మూగవారు టీచరు ఏ అక్షరాన్ని ఎట్లా పెదవులు కదిలించి నాలుక సహాయంతో గొంతులోనుంచి పలికించటానికి ప్రయత్నం చేస్తున్నారో నీల ప్రత్యక్షంగా చూసింది.

మూగబధిరాంధులను ఎందుకూ పనికిరానివారని తీసిపారవెయ్యకుండా ఎటువంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి! విజ్ఞానశాస్త్రం చేయలేనిదేదీలేదని ప్రతిజ్ఞ పట్టిందా? అంతాచేసి చూపిస్తుందా? సంఘంలో అవిటివారు వెనకబడి ఉండ నక్కరలేదని ధైర్యం చెబుతున్నదా! నీలకు అంతు పట్టటంలేదు.

ఆరాత్రి పక్కమీద కూర్చుని ఒక్కొక్క అక్షరమే పలకటానికి ప్రయత్నం చేసింది నీల.

నీలకు పాట నేర్చుకోవటంలో ఎంతపట్టుదలో మాట నేర్చుకోవటంలోకూడా అంత పట్టుదలా ఉంది.

రంగారావుగారు రాజగోపాల్ దగ్గరనుంచి ఏం కబురు వస్తుందోనని వారంరోజులు ఎదురు చూశారు. కాని అక్కడినుంచి ఏకబురూ రాలేదు. ఆయన దానినంతటితో వదలిపెట్టి మరో సంబంధం చూశారు. అతడు వస్తూనే నీలను సూటిగా "నాకెక్కడికయినా ట్రాన్స్ఫరయితే నాతో వస్తావా? లేక ఉద్యోగం చేసుకుంటూ ఇక్కడే ఉంటావా?" ప్రశ్నించాడు.

ఆమె తలఎత్తి అతడి ముఖంలోకి చూసింది. కొంతసేపటికి అవును-కాదు అని తెలియకుండా తల అడ్డంగా ఊపింది.

అతడు తనతో వస్తుందని అర్థం చేసుకున్నాడు.

"నామీద ఆధారపడిన తల్లి ఉంది. పెళ్ళయితే ఆమె మనతోనే ఉంటుంది. నీకు అభ్యంతరమా?" మరొక ప్రశ్న వేశాడు.

దానికీ ఆమె తల వూపింది.

ఆమెను మాట్లాడించాలని అతడు ఎన్నో ప్రశ్నలు వేశాడు.

ఆమె దొకటే జవాబు.

ఆమె అందాన్ని చూసి మురిసిపోయిన అతడు కనుబొమలు ముడిచాడు. కుర్చీలో వెనక్కు వాలిపోయాడు.

రంగారావుగారు అనసూయమ్మల గుండెలు గుబగుబ లాడుతున్నాయి.

చూడవచ్చిన వరుడు లేచి నిలబడి "వస్తాను" అంటూ వెళ్ళాడు. వీథివాకిలివరకూ సాగనంపిన రంగారావుగారితో అన్నాడు. "ఏమిటండీ మా టే మాట్లాడదు? మూగదా లేక అహంభావమా" అని.

రంగారావుగారు ఏదో చెప్పాలని పెదవులు కదల్చబోయారు. గొంతులో నుంచి మాట పెకలలేదు.

ఏదో ఉంది కథ అనుకుంటూ అతడు కదిలిపోయాడు.

ఆయన లోపలికి వెళ్ళి ఒక కుర్చీలో నీరవుడై కూలబడ్డాడు.

అనసూయమ్మకు మొదట నీలపై కోపం వచ్చింది. ఏదో ఒక మాట మాట్లాడకపోయిందా అని. ఆయన పక్క కుర్చీలో కూర్చుని ఆ మా టే అన్నది.

"ఎట్లా మాట్లాడుతుంది? చేతనయితేకదూ?" బాధకొద్దీ కళ్ళు మూసుకున్నారు.

"పోనీ కాగితమ్మీద వ్రాసి చూపించకపోయిందా?"

"దాని బాధ-దాని పరిస్థితి నీకు తెలియదు. ఆ అశక్తతను అది ఎట్లా బయటపెట్టుకుంటుంది? ముందే నేను చెప్పవలసింది. కాని-తండ్రిగా నేనూ బయటపెట్టలేదు. ఆ చెప్పటం ఉందే అది వట్టి మాటకాదు. బాధతో కూడినది. అది వ్యక్తం చెయ్యలేని బాధ."

"ఈ సంగతి అదిగాని మీరుగాని ముందే చెప్పాలి. వచ్చిన వాళ్ళను సందిగ్ధంలో పెట్టకూడదు. ఇకనుంచి ముందే ఎవరిచేతనయినా చెప్పించండి. లేదా లాగానే నేనే చెబుతాను"

సాయంత్రం వరకూ ఆలోచనలో మునిగిపోయిన నీల తండ్రికి ఒక కాగితం తెచ్చియిచ్చింది.

"నాకోసం వారినీ వీరినీ పెళ్ళిచూపులకని తీసుకురాకండి. నేను ఎవరినీ చూడను. నేను ఆనంద్‌ను తప్ప ఎవరినీ చేసుకోను. అతడు కాకపోతే పెళ్ళిమాట తలపెట్టను."

ఆయన చేతిలోనుంచి తీసుకుని చదివింది అనసూయమ్మ ఆ కాగితాన్ని.

"ఏమిటండీ దీనికి పిచ్చి? దాని అవిటితనం తెలియదు కనుక చూడటానికి వచ్చారు కాని- తెలిసినవాళ్ళు వస్తారా? ఆనంద్ చేసుకుంటాడా? ఎందుకు చేసుకుంటాడు?" ఆమె గొణిగింది.

సాయంకాలము ఒక గంటసేపయినా వాళ్ళిద్దరూ పిల్లల పెళ్లిళ్లను గురించి చర్చించుకుంటారు. ఆమెకు కృష్ణను గురించిన భయం రోజు

రోజుకు ఎక్కువవుతున్నది. ఆ విషయం తన కడుపులో దాచకుని ఒక్కతే భరించలేక పోతున్నది.

"పోనీ కృష్ణకు ముందు చేద్దామా ?" ఆలోచనగా అడిగింది.

"పెద్ద పిల్లను కంటి ఎదుట ఉంచుకుని ఏం కర్మ చిన్నదానికి చేయటానికి ?" తండ్రి ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

అనసూయమ్మ ఇక పట్టలేకపోయింది. "కృష్ణకు ఇప్పుడు చేస్తేనే మనం చెయ్యగలిగినట్టు. ఇంకా ఆగితే మన ప్రమేయం ఉండదు. ఆలోచించండి."

ఆయన తల ఊపి ఊరుకున్నాడు.

కృష్ణకు సంబంధాలు చూస్తూ మధ్యమధ్యలో అనసూయమ్మ ఆలోచనలో పడిపోతుంది. తన ఆలోచనలను రంగారావుగారి చెవిన వేస్తుంది. ఆయనకు మతిపోయినంతపని అవుతుంది.

"నీలకు ఇంక పెళ్ళి కాదేమో ?" అంటుంది.

"కాకపోతే పోనీ. ఎవడో డబ్బు కాశపడి చేసుకుని దాన్ని చిన్నచూపు చూసినదానికంటె అలా వుండటమే మంచిది. అది ఉద్యోగం చేసుకుని బ్రతుకుతుంది. జీవితంలో పెళ్ళి అంత ముఖ్యమా ? లేకుండా బ్రతకలేరా మనుష్యులు ? గౌరవ మర్యాదలను కాపాడుకుంటూ కూడా ఉండవచ్చు." ఆయన కొంచెం తీవ్రంగా అన్నారు.

ఆయన నింక మాట్లాడనివ్వదలచలేదు అనసూయమ్మ. ఆయనకు నీల అంటే ప్రాణం. నీలకు సంబంధించినమాట ఏదయినా ఆయన ఎదుట అనటానికి వీలు లేదు.

కృష్ణకు సంబంధాలు వస్తున్నాయి. వరుడు పెళ్ళి చూపులకని వచ్చినప్పుడు నీల ప్రసక్తి వచ్చినా ఆయన దాటవేస్తున్నారు. ఈ విషయాలు నీల చెవిన పడనియ్యటం లేదు.

కాని, కృష్ణ వరులను అంత త్వరగా మెచ్చే రకం కాదు. ఎన్నో రకాల వంకలు పెడుతుంది. ఒకరిని పిరికివాడంటుంది. ఒకరిని మాట్లాడటం చేతగాని వాడంటుంది. ఒకరికి వ్యక్తిత్వం లేదంటుంది.

"ఎవరే నీకు నచ్చినవాడు ?" తల్లి విసుక్కుంది.

"చూద్దాం. పదిమందిని చూస్తేకదా ఎన్నిక చేసుకోవటానికి వీలు ? ఎవరినిపడితే వాళ్ళను చేసుకునే కాలమా ఇది ? అమ్మా ! నీ కాలం అయిపోయింది" అంటుంది పకపక నవ్వుతూ.

ఏడాది తిరగకుండానే కృష్ణకొక వరుడు నచ్చాడు. పెళ్ళిచూపుల నాటి ఉదయం స్కూలుకు వెళ్లుతున్న నీలతో "అక్కా ! సాయంత్రం తొందరగా వస్తావా ?" అంది గంభీరంగా.

"ఎందుకు ? నాతో ఏమయినా పని ఉన్నదా ?" గడపలోనే నిలబడ్డది నీల.

"ఎందుకంటే ఇవాళ మన ఇంట్లో ఒక ఫంక్షను ఉంది."

"ఏమిటది ?"

"పెళ్ళివారు వస్తున్నారు. అందుకని."

"పెళ్ళికూతురిని నేను కాదుగా ?"

"కావులే. కాస్త ఆ సందర్భంలో ఫిడేలు వాయిస్తావేమోనని."

కళ్లు పైకెత్తి చూసింది నీల. ఆమెకు కోపం వస్తే అలాచూస్తుంది.

"కోప్పడకు అక్కా. నీవు సాధన చేస్తున్నావు కనుక అడిగాను." ఆ మాటల్లో కొద్ది హేళన ధ్వనించింది.

విసురుగా వెళ్ళిపోయింది నీల. ఆమెకు కళ్ళనీళ్ళు ఉబుకుతూ పైకి వచ్చాయి. దీని హేళనకు అంతులేకుండా పోయిందనుకుంది.

స్కూలు పని అయిన తరువాత చంపకం ముందు కూర్చుని తను ఆమెదగ్గర నేర్చుకున్న పాటలు వాయించి చూపించింది. చంపకం మరొక కొత్త కీర్తన నేర్పింది.

"నీలా, నీ వేగానికి నేను తట్టుకోలేక పోతున్నాను" అన్నది చంపకం మెచ్చుకోలుగా.

నీల నవ్వింది. ఆమె పలువరస తళుక్కుమంది. ఆ నవ్వు ఆమె ముఖానికి ఎంతో అందాన్నిచ్చింది.

"నీలా, నా దగ్గర నేర్చుకుంటున్నావన్న పేరేగాని నీవు సంగీత విద్వాంసురాలవయి పోతున్నావు" అన్నది శిష్యవాత్సల్యంతో.

నీలకు చంపకం అన్న మాటలతో కొద్దిపాటి ఆత్మవిశ్వాసం ఏర్పడ్డది. తను ఇంకా బాగా నేర్చుకోవాలి. వాయించుతూ ఉండగా ఆనంద్ వినటం తటస్థించితే? అతడికి ఆనందాన్ని కలిగిస్తుందా తన సంగీతం? మెచ్చుకుంటాడా?

మరి కాసేపటికి ఆమెకే తోచింది తను ఎంత వెర్రిది అని. తను ఎక్కడికి వెళ్ళి వాయించుతుంది?

అన్నిటికీ సందేహిస్తూ కాలహరణం చేస్తూ ఉండటం ఆమెకు నచ్చలేదు. సాధన చేయటం తనవంతు అంతే.

నీల అక్కడినుంచి సరాసరి మూగబధిరాంధుల పాఠశాలకు వెళ్ళింది. సీమంతిని నీలని హెడ్‌మాస్టరుకి పరిచయం చేసింది.

"ఈమెకు మాట మెరుగవుతుందంటారా? పుట్టుకతో వచ్చినది కాదు" అంది సీమంతిని.

"ఏదయినా ఒకటే కదా! సాధనవల్ల కొద్దిగా మెరుగవుతుంది కాని సహజంగా అందరిమాదిరి గారాదు. అదిముందు మనం గ్రహించాలి. తరువాత ఎంత వచ్చినా మెరుగే. ప్రయత్నించండి. మన దగ్గర పద్ధతులు ఉన్నాయిగా. దానికి సంబంధించిన టీచరు దగ్గరికి తీసుకువెళ్ళండి." ఆయన తన పనిలో మునిగిపోయాడు.

సీమంతిని నీలను టీచరు దగ్గరికి తీసుకువెళ్ళింది. నీలను గురించి తనకు తెలిసినదంతా చెప్పింది.

క్లాసులు అయిపోయాయి. స్కూలు ఖైమయిపోయింది. అయినా టీచరు నీలను క్లాసురూములోకి తీసుకువెళ్ళి అక్షరాలు, సంయుక్తాక్షరాలు, వత్తులు ఒకదాని తరువాత ఒకటి అనిపించటం ప్రారంభించి ఒక గంట సేపు శిక్షణ యిచ్చింది.

"మీరుకూడా ఇంట్లో ప్రయత్నం చేయండి. కృషిమీదనే ఫలితాలు" అన్నది నవ్వుతూ టీచరు.

నీల సీమంతినితో చెప్పింది. తనెప్పుడు వస్తే టీచరుకి వీలుగా ఉంటుందో తెలుసుకొమ్మని.

ఇద్దరూ స్కూల్లో పనిచేసేవాళ్ళే. నీల ఈ స్కూలుకు వచ్చేసరికి నాలుగు దాటుతుంది సామాన్యంగా. అదికూడా సంగీతసాధన చేయకుండా వస్తే. నీల దృష్టిలో మాటకెంత విలువో పాటకంత విలువ. దేని విలువనూ తగ్గించటానికి వీలులేదు.

ఈ సమస్యను చంపకానికి చెప్పింది. నీల పట్టుదలకు ఆమె మనసు కరిగిపోయింది.

"నీలా! ఇంకా కొన్ని రోజుల్లో నేను సంగీతపాఠం ముగిస్తాను. అలా అయితే నీవు ఆ టీచరు దగ్గరికి తొందరగా వెళ్ళగలుగుతావు. నిన్ను చూస్తే నాకు ఎంతయినా సహాయం చేయాలనిపిస్తోంది."

చంపకం మాటలకు నీల కళ్లు చెమర్చాయి. 'అందరూ తనకు సహాయం చేస్తారు. జాలిపడుతూ చేస్తారు.' ఆమె తన పరిస్థితులను తలచుకుని కుమిలిపోయింది. మరి కాసేపటికి సర్దుకుని కాగితం తీసుకుని కలంతో వ్రాసింది.

"చంపకం! నామీద నీకెంతో జాలి, ప్రేమ ఉండటం నా అదృష్టం. నేను ఈ కళలో నిష్ణాతురాలనయ్యేలా నాకు పాఠం చెప్పు. నేను నీ కర్పించే గురుదక్షిణ నీ పాదాలమీద నా కన్నీటి చుక్కలు."

చదువుకుని పకాలున నవ్వింది. ఆ నవ్వులో నీల ఆవేదనవల్ల తనకు కలిగిన హృదయ కంపనం ద్యోతకమవుతోంది.

"నీకు కన్నీళ్లు ఊరికేనే రాల్తాయి. ఆ కన్నీరా నాకు గురుదక్షిణగా ఇచ్చేది? అలా తేలిగ్గా చెల్లగొట్టేద్దా మనుకున్నావా? నాకూ, అక్కడ మాటలు నేర్పే టీచరుకీ ఘనంగా కట్నాలు కావాలి. నీవు పెళ్ళి చేసుకున్న తరువాత మా గురుదక్షిణను గురించి ఆలోచించు. నీవూ మీ ఆయనా కలిసి ఇవ్వాలి తెలిసిందా?" మందలిస్తూ దీవించి శుభాకాంక్షలు తెలిపింది చంపకం.

ఆ మరునాటినుంచీ, ఒంటిగంటనుంచీ రెండు గంటలవరకూ సంగీత శిక్షణ, మూడునుంచీ నాలుగు గంటలవరకు మాటల శిక్షణ, ఏర్పాటయింది. ప్రిన్సిపల్ మిస్ రాబర్టుకు కూడా ఈ సంగతి చెప్పి అరగంట ముందుగా వెళ్ళటానికి పర్మిషను తీసుకుంది నీల.

ఇంట్లో సాధన చేసుకోవటానికి నీలకు అంత సౌకర్యం లేదు. పిల్లలంతా ఒక గదిలో పడుకుంటారు. ఆ ఇంట్లో మూడే గదులు. పిల్ల

లందరికీ ఒక గది, రెండవది తల్లిదండ్రులకు, మూడవది వంట భోజ నాలకు. ఈ పోర్షను మేడమీద ఉన్నది. తమ గదిలో సాధన చేసుకోవ టానికి అందరూ పడుకున్న సమయంలోనే వీలవుతుంది. నీల ఇటువంటి సాధన చేస్తుందని పసికడితే కృష్ణ ఆ రాత్రి నిద్రపోకుండా అక్క మీద కాపలా కాస్తుంది. అందుకని రాత్రి పదకొండు గంటలయిన తరువాత, కృష్ణ గాఢంగా నిద్రపోయినదన్న నమ్మకం కుదిరిన తరువాత, అప్పుడు మెల్లగా టీచరు చెప్పినట్టుగా సాధన చేయటానికీ పూనుకుంటుంది నీల. స్కూల్లో తనకు ఏ అయిదు నిముషాలు తీరిక లభించినా ఈ సాధనకే వినియోగిస్తున్నది. అప్పటినుంచీ ఆమె వృథా చేసిన క్షణాలు రెండు కూడా లేవు.

## 5

నీల ఒక చిన్న ట్రాన్సిస్టరు కొన్నది. సంగీతంలో వచ్చే ప్రోగ్రాములన్నీ సాధ్యమయినంతవరకూ వింటూ ఉంటుంది. గాత్రం కాకుండా అచ్చగా వీణవాయించేవాళ్ళు, ఫిడేలు వాయించేవాళ్ళు, ఫ్లూట్ వాయించేవాళ్ళు, క్లారినెట్ వాద్యము అన్నీ వింటూ ఉంటే ఆమె మనసులో తనకుకూడా ఒక ఛాన్సు దొరికితే బాగుండుననిపించేది.

ఎట్లా వస్తుంది రేడియో ప్రోగ్రామ్?

ముందుగా ఆడిషన్ తీసుకోవాలి. సెలక్టుకావాలి. అప్పుడు ప్రోగ్రామ్ రావాలి. ఇదికాక-అక్కడున్న వాళ్ళెవరయినా తనపట్ల కొద్ది పాటి శ్రద్ధ కనబరచాలి.

అక్కడున్న వాళ్ళల్లో తెలిసినవాళ్ళు అంటూ ఎవరూలేరు. కాని— ఒక్క ఆనంద్ ఉన్నాడు. అతడు తెలిసినవాళ్ళల్లో లెక్కా ? అతడికి తన మీద ఎటువంటి అభిప్రాయం ఉందో ?

తెలుసుకుందామంటే తనకు నోరేది ? ఉత్తరం వ్రాయచ్చు కాని— ఉత్తరాలవల్ల కొన్ని ప్రమాదాలు ఉన్నాయి. ఈ ఉత్తరాన్ని అతడు ఏ దృష్టితో చూస్తాడో ? అతడికి మామూలు మర్యాదయినా లేకపోతే చులకనగా చూస్తాడు. వద్దు వద్దు. అటువంటి పరిస్థితులు ఎదురుకావద్దు.

అయినా తనకా ప్రోగ్రామ్ తొందర ఎందుకు ? అది లేకపోతే ఏం?

తనలా ముడుచుకుని కూర్చుంటే తన సంగతి ఆనంద్‌కు తెలిసేది ఎలా ?

ఈ మానసిక సంఘర్షణ తరుచుగా తలెత్తుతూనే ఉండేది. మానవాతీతమైన ఏ శక్తో వచ్చి నీలను రక్షిస్తూ ఉండేది.

కృష్ణకు పెళ్ళి కుదిరింది. వరుడు సిమెంటు కంపెనీలో ఉద్యోగి. చాలా సరదామనిషి. చమత్కారంగా మాట్లాడుతూ ఉంటాడు. మంచి క్రికెట్ ఆటగాడు. బుల్‌బుల్ తరంగ్ వాయించటమంటే చాలా ఇష్టం. కృష్ణకు బాగా నచ్చాడు. కృష్ణ చదువు ఆమె చేసే చిన్న ఉద్యోగం ఆమె చురుకుదనం, తెలివీ అతడికీ నచ్చాయి.

పెళ్ళి కమ్యూనిటీ హాల్లో జరిగింది. పెళ్ళివారు వెళ్ళిపోయారు. ఇంటికి వచ్చిన మరునాడు, భోజనాలయిన తరువాత వాళ్ళ ప్రయాణం.

పెళ్ళి రెండు రోజులుందనగా కృష్ణ పెళ్ళికని తెచ్చిన కొన్ని సామాను నీలకు చూపించింది. "అక్కా నేను పెళ్లి కాగానే వెళ్ళిపోతాను" అన్నది.

నీల నవ్వు ముఖం పెట్టింది.

"అతడు నేను వెంట వెళ్ళకపోతే ఊరుకునేటట్టు లేడు" అంది నీల ముఖంలోకి చూస్తూ.

అదే నవ్వు ముఖం.

"మోహన్ వంటివాడు భర్తగా లభించటం చాలా అదృష్టం. అసలు అటువంటివాళ్లు లోకంలో చాలా అరుదు."

"నీవా అదృష్టవంతులలో ఒక దానవు" వ్రాసి చూపించింది నీల.

"సామాన్యమైన అదృష్టమా ?" మురిపెంగా చూసింది కృష్ణ నాకు కనుక అటువంటివాడు దొరికాడన్నట్టు చూస్తూ నవ్వింది.

నీల కృష్ణ భుజం తట్టి బుగ్గలు పుణికింది.

తను వెళ్లేవరకూ నీలను ఆటలు పట్టిస్తూ ఉండేది కృష్ణ.

నీల వంట ఇంట్లో వధూవరులకు భోజనాల ఏర్పాట్లు చేస్తు వుండగా పక్క గదిలోనుంచి మాటలు వినబడ్డాయి.

"అది మూగదండీ. దానికి మాటలు రావు ఇంక పెళ్ళి ఎట్లా అవుతుంది ?" అంటోంది కృష్ణ.

"మీ రాము చెప్పాడు. ఎక్కడో ఉద్యోగం చేస్తోందట. ఫిడేలు వాయిస్తుందట."

"ఆఁ వాయిస్తుంది లెండి. ఉద్యోగమంటే అదే టైపిస్టు పని. స్టోర్ కీపర్ పని చేస్తుంది."

"టైపిస్టు అంటే చదువుకుందా? లేకపోతే ఎట్లా చేయగలుగుతుంది?"

"అంత కుతూహలమేమిటి మీకు ? మెట్రిక్ ప్యాసయింది. టైపు హైయర్ పాసయింది. ఆమె చదివిన స్కూల్లోనే ఆ ఉద్యోగమిచ్చారు

దయతలచి, పెళ్ళి ఎల్లాగూ కాదు కనుక మా వాళ్ళు ఆ ఉద్యోగం చెయ్య నిస్తున్నారు."

"పెళ్లి ఎందుకు కాదు? ఆమెకు తగ్గ వరుడు దొరుకుతాడు."

"ఆమెకు తగ్గ వరుణ్ణి ఆమె మెచ్చుతుందంటారా? ఆమె తనకే అందగాడో, పెద్ద ఉద్యోగస్తుడో కావాలని కోరుకుంటోంది. ఒక చక్కని అబ్బాయిమీద దృష్టి నిలిపింది. కాని, ఆ అబ్బాయికి ఈ అమ్మాయికి మాటలు రావని తెలిసింది. అప్పటినుంచీ కనబడకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ అమ్మాయి అది గ్రహించకుండా అతడిని గురించి కలలు కంటూ కాలం గడుపుతోంది."

"అయ్యో పాపం!"

"ఇంక దాని సంగతి వదిలెయ్యండి. మన ప్రోగ్రామ్‌ను గురించి ఆలోచించండి."

భోజనాలయిన తరువాత తల్లిదండ్రులకు పిల్లలకు వెళ్తున్నానని చెప్పి బండెక్కారిద్దరూ.

అక్కకోసం చూడలేదు కృష్ణ. ఆమెకు చెప్పి వెళ్లాలని తోచలేదు. బండి ఎక్కిన తరువాత పై కిటికీవైపు చూస్తూ "అక్కకు కుళ్లుగా ఉంది ముందు నాకు పెళ్ళైందని" అన్నది మోహన్‌తో.

"అందుకేనా ఆమెతో చెప్పలేదు బయలుదేరేటప్పుడు?" అతడంటున్నాడు.

"అంతే. లేకపోతే ఏమిటి? మనం సంతోషంగా వెళుతూ ఆ ముఖం మాడ్పు ఎందుకు చూడాలి?" బండి కదిలింది.

పైనుంచి దిగివచ్చి ఆఖరు మెట్టుమీద తండ్రివెనక నిలబడ్డ నీలకు కృష్ణ ఆంతర్యం బాగా అర్థమయింది. ఇప్పటినుంచే కాదు, నీలకు మాట పోయినప్పటినుంచీ చెల్లెలు ప్రవర్తనకు అర్థం తెలిసింది.

అంత దురభిప్రాయమా చెల్లెలికి తనమీద?

నీలకు కడుపులో దేవినట్లయింది.

లోపం ఉన్నవాళ్ళమీద ఇటువంటి అభిప్రాయం ఉంటుందికాబోలు! తల్లీతోడూ చివరికి కన్నవారికి కూడా ఉంటుందేమో?

అయితే తనమీద అందరూ చూపించే జాలి వెనుక ఇటువంటి భావము ఉందా?

నీలకు తల తిరుగుతున్నట్లయింది. మెట్లమీద నుంచి జారిపడ్డది.

నాలుగు మెట్లు పైకెక్కిన తండ్రి దిగి వచ్చి పట్టుకున్నాడు. వీధి వాకిలిదాటి నాలుగు అడుగులు వేసిన తల్లి వచ్చి "ఏమయింది?" ఆదుర్దాతో పట్టుకుంది.

"కళ్లు తిరిగాయి" అంటూ తండ్రి చేతి ఆసరాతో పైకెక్కింది నీల.

నీల కళ్లు మూసుకుని పడుకుంది. తల్లి వేడివేడి కాఫీ తెచ్చి తాగించింది.

"కొంచెంసేపు పడుకో. ఒళకు భోజనం లేక కళ్లు తిరిగాయి." తండ్రి ఆ గదిలోనుంచి బయటికి వచ్చాడు.

"చిన్నదానికి పెళ్ళి అయిందని దీనికి మనసు బాధ పడ్డట్టుంది" అన్నది అనసూయమ్మ.

"అటువంటిదయి ఉండదు. నీలను పడుకోనీ" అన్నాడాయన. ఏ మాటా ముందుగా నీరు జారకూడదని ఆయన ఉద్దేశ్యం. నిజమయినా

కాకపోయినా ఒకరి నోటివెంట ఏ మాటయినా వస్తే పదిమందీ అదే అంటారు. నిజము తెలుసుకుందామని అనుకోరు. అటువంటి ఆలోచన కూడా చేయరు.

ఆ ఇంట్లో పదిహేను రోజులవరకూ కృష్ణ పెళ్ళిమాటలే వినబడుతూ వచ్చాయి. కృష్ణ మోహన్ల సరస వినోదాలూ చమత్కారాలూ మళ్ళీ మళ్ళీ చెప్పుకుని ఆనందిస్తోంది అనసూయమ్మ.

తండ్రి వింటున్నాడు.

నీల మూడోనాటినుంచీ యథాప్రకారంగా స్కూలుకు వెళ్లుతున్నది.

కృష్ణ వెళ్లిన తరువాత ఫిడేలు సాధన ఇంట్లో కూడా బాగా సాగుతున్నది. ఒక్కొక్కనాడు ఆమె సాధన చేస్తుంటే తండ్రి ఆగదిలోకి వచ్చి వింటూ ఉంటాడు.

చంపకం ఒకనాడు అడిగింది నీలను "నీకు బాగా వచ్చిన కీర్తనలు మూడు నాలుగు ఎవరయినా వాయించమంటే వాయిస్తావా" అని.

"అమ్మో. నాకు భయం" అన్నట్టు చూసింది నీల.

"నీకు భయం అక్కరలేదు. నేను నీవెంట ఉంటాను. నీ తరువాత నేనూ వాయిస్తాను" చంపకం అనగానే నీల ఒప్పుకుంది.

చంపకం ఇంటి దగ్గర కమ్యూనిటీ హాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గాన కచేరీ ఏర్పాటయింది. చంపకం తమ యిద్దరి పేర్లూ ఇచ్చింది.

కమ్యూనిటీహాలు ముందర పెద్ద షామియానా వేశారు. లౌడ్‌స్పీకర్లు పెద్ద ట్యూబ్‌లైట్లూ ఏర్పాటయ్యాయి. జనం చాలామంది వచ్చారు. ఉపన్యాసాలయిన తరువాత డాన్సు ప్రోగ్రాము పెట్టారు. చివరకు గానకచేరీ. చంపకం రెండు కీర్తనలు వాయించింది. ఆ తరువాత నీల రెండు వాయించింది.

ఆ రెండు కీర్తనలూ పదిమందిలో వాయించేసరికి నీలకు చాలా ధైర్యము వచ్చింది. నీల ధైర్యం చూసి చంపకం సందర్భం వచ్చినప్పుడు పాట కచేరీ పెట్టిస్తూ వచ్చింది. ఎవరూ ఆమెతో మాట్లాడటానికి దగ్గరికి రాకుండా జాగ్రత్త పడేది. ఒకవేళ ఎవరయినా నీల దగ్గరికి వస్తే తనే మాట్లాడి పంపించేది.

నీల కిప్పుడు వెనుక ఉన్నంత న్యూనతాభావం లేదు. కాని-సాధన మాత్రం మానకుండా మొదట చేసినంత శ్రద్ధగా చేస్తున్నది.

సీమంతిని మూగబధిరాంధుల పాఠశాలలో వార్షికోత్సవాల సందర్భంలో నీల పాట కచేరీలు ఏర్పాటు చేసే. అక్కడి విద్యార్థులు కొందరు తబలా వాయించేవారు. ఇతర వాద్యాలు ఇంకా కొందరు వాయించేవారు. అక్కడి విద్యార్థులు చాలా మంది చేతిపనులలో నిష్ణాతులు. ఏదో ఒక వృత్తి విద్యలో శిక్షణ పొందినవారు. వాళ్ల మధ్య ఒక గంట సేపు ఉన్నా ఎంతో ఉత్సాహం కలుగుతోంది నీలకు.

మాటలు నేర్పే టీచరు నీల మాట ఇదివరకూ కంటే చాలా మెరుగు అంటుంది. ఆమె మాటలు వినటానికి అలవాటు పడినవాళ్ళకు కొద్దిగా అర్థమవుతున్నట్లనిపిస్తోంది. ఆమె నోరు మెదపగానే ఎదటివాళ్ళు ఊహించుకుని అదా ఇదా అని అడుగుతుంటే 'ఆఁ' అని తలతిప్పుతున్నది నీల.

అడుగుతీసి అడుగుపెట్టలేని మనిషి పది బారల దూరం నడిచినట్లనిపిస్తోంది అందరికి.

## 6

రామూ స్నేహితుడు రఘురాముతో కలిసి పరీక్షల రోజుల్లో చదువుకోవటానికి వస్తాడు. వాళ్ల ఇల్లు చాలా దూరాన ఉండటం చేత అతడి

అన్న సత్యం స్కూటరు మీద వచ్చి ఇంటికి తీసుకువెళ్లటం, తిరిగి తీసుకు రావటం జరుగుతున్నది. సత్యం కూడా స్వతంత్రంగా ఇంట్లో తిరుగుతూ అనసూయమ్మను పిన్నిగారూ అని పిలుస్తూ ఉంటాడు.

రామూకి పరీక్షలు మొదలయ్యాయి. అవి పబ్లిక్ పరీక్షలు. రామూ స్నేహితుడు రఘుకూడా బాగా మార్కులు వస్తే ఇంజనీరింగ్ చదవాలన్న ఆశతో ఉన్నాడు.

ఆనాడు బట్టలు తెచ్చుకుంటానని ఇంటికి వెళ్లిన రఘు ఇంకా రాలేదు. అతడు వస్తే భోజనం చేసి స్కూలుకు వెళ్లాలని రామూ వీధి వాకిట్లో పుస్తకం చేతబట్టి నిలబడ్డాడు.

అతడి తరువాతవాడు శ్రీనివాసు. మరొక స్కూల్లో ఐదవ తరగతి చదువుతున్నాడు. అతడు ఎప్పుడూ తల్లిని అంటిపెట్టుకునే ఉంటాడు. అతడు గుణములో కృష్ణను పోలి ఉంటాడు. మాటలో నిర్లక్ష్యమూ! తొందరపాటూ? ఎక్కువే. నీలను గురించి 'ఆ మూగదానితో నాకేమిటి?" అనుకుంటాడు. కాని- ఆరోజు తల్లి చెప్పటంచేత శ్రీనివాసుకు రామూతో పాటు వడ్డించింది నీల.

"నీవు వడ్డిస్తే నేను రాను. అమ్మ పెట్టాలి" అంటూ అక్కడే నిలబడ్డాడు. స్కూలుకు టయమయిందని అతడిని భోజనాల యింట్లోకి తీసుకువెళ్లాలని నీల అతడి చెయ్యి పట్టుకుంది.

అతడు ఆమె చేతిని విదిలించి కొట్టాడు.

అంతలో రామూ వచ్చాడు తన స్నేహితుడిని తీసుకుని.

నీల వాళ్లిద్దరికి పళ్ళేలు పెట్టబోతే "అక్కా. రఘు భోజనం చేసి వచ్చాడు. నాకు ఒక్కడికే పెట్టు" అన్నాడు. శ్రీనివాసు భోజనానికి

కూర్చోకుండా నిలబడే ఉండటం చూసి మందలించి పళ్లెం దగ్గరికి తీసుకు వచ్చాడు.

"అన్నం తిను. అక్క పెట్టింది. నీకు వేళయింది కదా?" అన్నాడు రాము. శ్రీనివాసు కదల్లేదు.

ఒరే రామూ. మీకిద్దరికీ ఏమయినా కావాలంటే చెప్పండి. నేను స్కూటరుమీద మీ స్కూలుకే తెచ్చి ఇస్తాను" అంటూ లోపలికి వచ్చి, చెబుతున్న వ్యక్తిని తలెత్తి చూసింది నీల. అతడికి పాతికేళ్ల వయసు ఉంటుంది. పోలీసు డ్రెస్సులో ఉన్నాడు- కళ్లకద్దాలు పెట్టుకుని.

రాము ఏమీ వద్దన్నాడు అతడు వెళ్ళుతూ వెనక్కు తిరిగి "పిన్ని గారు లేరా ?" అడిగాడు నీలను చూసి.

లేరన్నట్టుగా తల తిప్పింది నీల తత్తరబాటుతో.

అతడు వెళ్ళిపోయాడు.

రామూ పరీక్షలు మధ్య మధ్య సెలవులవటంచేత ఇరవై రోజులు సాగాయి.

రఘు అన్న సత్యం మరొకరోజు వచ్చి "నేను క్యాంపుకు వెళ్తున్నానని, రఘుకు చెప్పండి. ఈ కలమూ పది రూపాయలూ వాడికివ్వండి" అంటూ బల్ల మీద పెట్టాడు.

అప్పుడే ఫిడేలు సాధన చేసి లేచిన నీల లోపల ఉన్న తల్లిని తీసుకు వచ్చింది.

"నీవు ఇవ్వకపోయావా ఫరవాలేదు. మేము లేమా నీ తమ్ముడి సంగతి చూడటానికి ?" అన్నది అనసూయమ్మ.

"మీరున్నారనుకోండి. అక్కడ మా అమ్మ ఊరుకోదుగా ?" అన్నాడు నవ్వుతూ.

"నీలా! కాఫీ కప్పులో పోసి తీసుకురా" అంటూ అతడిని నిలబెట్టే మాట్లాడుతోంది అనసూయమ్మ. "సత్యం, అయితే నీవు పదిరోజుల వరకూ రావా?" సంభాషణ సాగదీసింది.

అతడు నవ్వుతూ "నాలుగు రోజులే నండీ, మా అమ్మ కూడా సరిగ్గా ఈ మాటే అడిగింది" నీల తీసుకు వచ్చిన కాఫీ కప్పందుకున్నాడు

అదివరకు ఇంటికెవరయినా వస్తె కృష్ణ కాఫీ తీసుకువచ్చి ఇచ్చేది. ఇప్పుడు నీల చేయవలసి వస్తున్నది. నీలకు ఆపని చెప్పక తప్పటం లేదు అనసూయమ్మకు.

వచ్చినవాళ్లు ఏదయినా పలకరించినా అడిగినా నీల జవాబు చెప్పదు. ఆమె విషయం తెలిసినవాళ్ళు ప్రశ్నించనే ప్రశ్నించరు. తెలియనివాళ్ళే ఆమె దగ్గర నుండి జవాబు కోర్తారు. సత్యం అదివరకూ కృష్ణతోనే మాట్లాడాడు కాని- నీలను అప్పుడే చూస్తున్నాడు బాగా.

నీల లోపలికి వెళ్ళటం చూసి "కృష్ణ ఉత్తరాలు రాస్తున్నదా? క్షేమంగా ఉన్నదా?" అడిగాడు.

"మన ఆరాటమేగాని వాళ్లకు మనం జ్ఞాపకం ఉంటామా బాబూ!" వెళ్ళిన రెండు నెలలకు ఒక కార్డుమీద రెండు ముక్కలు రాసింది" అన్నదామె.

"కొత్త కాపురం" అంటూ నవ్వుకుంటూ వెళ్ళిపోయాడతడు.

రామూకి ఇంకా పదిరోజులు పరీక్షలు సాగాలి. ఆ యింటి వాతావరణంలో పరీక్షల ప్రభావం బాగా ఉంది. ఎక్కడికి వెళ్ళాలన్నా - ఎవరు వచ్చినా పరిక్షలు పరిక్షలు అన్న బెదురు కొట్టవచ్చినట్టుగా కనబడుతోంది ఇంట్లో. వంట ఇంట్లో అన్నీ నీల తయారుచేస్తే అనసూయమ్మ వంట చేస్తుంది. నీళ్ళు కాగబెట్టి పిలిచి స్నానం చేస్తుంది.

"గడియారం ఒక గంట కొట్టిందేమిటి? ఆరున్నర కాదు కదా? నీలా? నీలా?" అంటూ లేచి కూర్చుంది అనసూయమ్మ. తలవెంట్రుకలు చేత్తో సవరించుకుంటూ మళ్ళీ పిలిచింది.

పావుగంట తరువాత విసుక్కుంటూ లేచి చూసింది. నీళ్ళు కాగి లేవు. మంచినీళ్ళు పట్టలేదు. కూరలు తరిగిలేవు.

నీలా! నీలా! అంటూ గదిలోకి వెళ్ళింది. నీల పడుకునే ఉంది. అనసూయమ్మ చేత్తో తట్టి లేపింది. ఒళ్ళు కాలిపోతోంది. కళ్ళు తెరవలేక పోతోంది.

నీలా? జ్వరం వచ్చిందే. అప్పటినుంచీ గొంతు చించుకొని పిలుస్తున్నాను - తెలుసుకోకుండా. రాత్రి బాగానే ఉంది. కదమ్మా" గబగబా వెళ్ళి తండ్రిని లేపింది.

"నీలకు బాగా జ్వరం వచ్చింది. మీరు లేచి మందూ అదీ చూడండి. నేను వంట యింట్లోకి వెళ్తున్నా" ఆమె తొందర తొందరగా వెళ్ళిపోయింది. ఇంక ఇంటిపనులు ఒక్కతే చేసుకోవాలి. రాముకి పరీక్షలు. వంట ఎనిమిది గంటలకయినా కావాలి.

రంగారావుగారు లేచి నీలకు టెంపరేచరు చూశారు. నూట రెండు దాటింది. పిల్లలకు జ్వరం వచ్చినా మరేది వచ్చినా మందుల విషయం ఆయనే చూసుకోవటం అలవాటు. ఒక రోజంతా మాత్రలతో తనే వైద్యం చేయటం మామూలు. ఆయన నీలను లేపి ముఖం కడిగించారు. కాఫీ తాగించి, జ్వరం తగ్గే మాత్ర ఒకటి వేశారు.

'నీలా! స్కూలు సెలవుపెట్టు. నేను లీవ్ లెటర్ రాస్తాను గాని నీవు సంతకం పెట్టు. నేను పంపిస్తాను.' అన్నాడు.

నీల లేచి కూర్చుని సంతకం పెట్టడానికి కూడా ఓపిక లేనట్టుగా ఉంది. తండ్రి సహాయంతో లేచి కూర్చుంది. అతి కష్టమ్మీద సంతకం ఎలా చేసిందో గాని వెంటనే దిండుమీద వాలిపోయింది.

ఆమెను సరిగ్గా పడుకోబెట్టి, దుప్పటి కప్పి అక్కడే కొంతసేపు కూర్చుండిపోయాడు. ఆయన మెదడులో ఆలోచనలు వలయాకారంగా ఏర్పడ్డాయి నీల ఆయన తల్లిని పోలింది. సుందర సుకుమారమైన దేహం. తీర్చిదిద్దినట్లున్న అవయవాలు. తెల్లటి నుదుటిమీద నల్లటికురులు కుచ్చులు కుచ్చులుగా పడి గాలికి ఊగుతూ ఉండేవి. ఆమె చాలా తక్కువగా మాట్లాడేది. కాని - నీల మితభాషి కాదు. మాటలతో పాటలతో గలగల్లాడించేసేది ఇంటిని. తండ్రి ఆఫీసునుంచి రాగానే కబుర్లు మొదలు పెట్టేది. తల్లి వంట చేసేటప్పుడు ఆమెతో ప్రారంభి-చేది కబుర్లు చెప్పటం. తోటి పిల్లలతో ఎడతెగని మాటలు. స్కూల్లో తమకు తెలిసినవాళ్ళవరయినా ఉన్నా లేకపోయినా అందరినీ కలుపుకుని మాట్లాడేది. పది సంవత్సరాల పిల్ల ఏ పాటయినా సరే - ఒకసారి వినగానే పాడేది. అనసూయమ్మ ఎప్పుడయినా నీలమీద విసుక్కునేది. కాని రంగారావు గారు ఏ సందర్భములోను విసుగుదల చూపలేదు. ఆమెలో ఉన్న వాగ్ధోరణినీ గానంపట్ల ఆమెకు గల అభిరుచినీ చక్కని మార్గంలో అభివృద్ధి చేయాలన్నది ఆయన సంకల్పము.

నీల ఆరోగ్యం చాలామంచిది. టాన్సిల్సు ఉన్నందువల్ల ఎప్పుడూ జ్వరం వస్తూ ఉండేది. ఆపరేషను చేస్తే ఆ ఇబ్బంది ఉండదని డాక్టర్లు అన్నారు. ఒక డాక్టరు కొత్తగా నర్సింగ్ హోము పెట్టుకుని ప్రాక్టీసు చేస్తున్నాడు. ఆయన తాను సులభంగా ఆపరేషను చేస్తానని హామీ ఇచ్చాడు. రంగారావుగారప్పుడు ఒక తాలూకాలో పనిచేస్తున్నారు. ఆ

డాక్టరు ఇచ్చిన హామితో అమ్మాయికి ఆపరేషను చేయించాడు. కాని ఆప రేషను తరువాత నీలకు పాటాలేదు మాటాలేదు. రంగారావుగారు అడిగి నప్పుడల్లా ఆగండి నిదానంగా మాట వస్తుందనేవాడు.

ఎన్ని నెలలు చూసినా నీలకు మాటరాలేదు. రంగారావుగారు నీలను జిల్లా సివెల్ సర్జన్‌కు చూపించితే ఆయన బాగా పరీక్షచేసి, "ఆధునిక పద్ధతులు తెలియని డాక్టరు మీ అమ్మాయిని మూగపిల్లగా చేశాడు. మీరు అప్పుడే అమ్మాయిని ఇక్కడికి తీసుకురావలసింది. నేను చేసి ఉండే వాడిని. అతడి నర్సింగ్‌హోము ఆట్టహాసం చూసి మీరు మోసపోయారు. ఆమె బ్రతుకును బండలు చేశా"రన్నాడు.

రంగారావుగారికి తను చేతులారా కన్నబిడ్డ బ్రతుకు బండలు చేశా నన్న బాధ క్రుంగదీసింది. అక్కడికక్కడే నేల కొరిగిపోయాడు.

"రంగారావుగారూ. మీరు అంతగా క్రుంగిపోకూడదు. జరగకూడ నిది జరిగింది. ఒక వైద్యుడి చేతిలో, ఇదే విదేశాలలో జరిగి ఉంటే కోర్టులో కేసు పట్టేంతపని... ఇప్పుడు ఎవరూ సరిదిద్దలేని అపకారము పిల్లకు జరిగిపోయింది. మీరు ధైర్యము తెచ్చుకుని ఈ లోపంతోనే ఆమె జీవితాన్ని మంచి బాటలో నడిపించండి. చాలా తెలివిగల పిల్ల అంటు న్నారు. ఆమెకు కొంత స్కూలు విద్య ఉన్నది. కనుక దానినే అభివృద్ధి చేయండి. చిత్రకళ వాద్యసంగీతము వంటి వాటిలో అభిరుచి కలిగిం చండి. ఆమె నోటితో వ్యక్తము చేయలేని శక్తులను ఈ మార్గాన అభి వృద్ధి చేయగలిగితే ఆమె జీవితంలో నోటిమాటలేని లోపాన్ని కొంత వరకూ తీర్చినవారవుతారు. అమ్మాయిని చూస్తుంటే నాకే ఎంతో బాధ కలుగుతోంది. ఇంక తండ్రిగా మీ బాధను నేను గ్రహించాను. మీరు అమ్మాయి మనసు గాయపడకుండా జాగ్రత్తగా ఇంట్లోకూడా మంచి

వాతావరణం కల్పించి, ఆమె భవిష్యత్తును మెరుగుపరచండి" అని భుజం తట్టి ధైర్యం చెప్పి పంపించాడు.

రంగారావుగారు అంతులేని హృదయభారంతో తిరిగి వచ్చాడు. తన శాయశక్తులా డాక్టరు సలహా ననుసరించి నడుచుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

నీల మాట్లాడాలనుకునేది. స్పష్టంగా మాట్లాడలేకపోయేది. మాట్లాడలేకపోతున్నానని బాధపడేది. ఏదో పాట పాడాలని నోరు తెరిచి పాడబోయేది. పాడలేకపోతున్నానని ఖిన్నురాలయ్యేది... ఆ చిరాకుతో ఏడ్చేది. ఎవరూ ఆమెను శాంతింప చేయలేకపోయేవారు.

ఇలా ఏడ్పులతో చిరాకులతో కొంతకాలం గడిచింది.

నీలమీద పెట్టుకున్న ఆశలన్నీ అణగారిపోగా ఇంట్లో నీల ఒక సమస్యగా తయారయింది. నీల తరువాత ముగ్గురి పిల్లల భవిష్యత్తు ఒక్క పిల్లవల్ల నాశనం కావటం ఆయన ఊహించలేకపోయారు. నీలను ఒకదారిలో పెట్టాలి. అప్పుడుగాని మిగతా పిల్లలను గురించి ఆలోచించలేడు.

ఒక సంవత్సరము పట్టింది ఆయన ఆ మానసిక సంక్షోభమునుండి తేరుకోవటానికి.

ఆయన తల వంచుకుని- అభిమానాన్ని చంపుకుని నీల చదువుతున్న స్కూలుకు వెళ్లి హెడ్‌మిస్ట్రెసుతో ఈ సమస్యను గురించి చెప్పారు ఒకరోజు.

తెలివిగల నీలకు ఇటువంటి దుస్థితి కలిగినందుకు ఆమె చాలా బాధ పడ్డది.

కొంతసేపాలోచించి ఆమె "నీలను స్కూలుకు పంపించండి. చదువుకుంటుంది... పరీక్షలు కూడా రాస్తుంది" అన్నది.

"టీచర్లు అడిగినదానికి జవాబు చెప్పలేదు కదా !"

"ఆ సందేహం మీకు అనవసరం. జవాబు చెప్పకపోతేనేం? టెస్టులో రాస్తుంది. అలాగే పరీక్షలు కూడా రాస్తుంది. అంత తెలివిగల పిల్లకు చదు వాపుచేయటం మంచిదికాదు" అన్నదామె.

"నీలకు స్కూలుకు రావాలనే ఉంది. మీరనుమతిస్తే పంపుతాను. కాని- టీచరు అడిగిన ప్రశ్నకు నోటితో జవాబు చెప్పలేదు. రాసి చూపిస్తుంది."

"ఫరవాలేదు. నేను పర్మిషను ఇస్తాను. పంపించండి."

"నలుగురిలో నీల అభిమానం దెబ్బ తింటుందేమోనని భయంగా ఉంది. పిల్లలు హేళన చేస్తే ఏడుస్తుందని జంకుతున్నాను" ఆయన పడుతున్న బాధ ముఖమ్మీద స్పష్టంగా కనబడుతోంది.

"మొదట్లో కొంచెం బాధగా ఉన్నా తరువాత పిల్లలకు అలవాటయి పోతుంది" ఆమె అనుభవం గలది కనుక విశదంగా చెప్పింది.

అలా స్కూల్లో తిరిగి ప్రవేశించిన నీల చదువు కొనసాగించింది. స్కూల్లో పిల్లలు కొందరు హేళన చేసేవారు. ఆమె టీచర్లతో ఫిర్యాదు చేసేది పిల్లలను కొట్టబోయేది. స్కూలుకు పోనని మొండికి వేసేది. ఇంటికి రాగానే తండ్రి ఆమెను దగ్గరగా కూర్చొబెట్టుకుని శాంతపరచి కబుర్లలోకి దింపేవాడు.

ఆయన బుజ్జగింపుతో నీల మనసులోని బరువంతా ఆవిరయిపోయేది. తేలికగా నవ్వేసేది.

ఆమె హాయిగా నవ్వుతూ గంతులువేస్తూ చదువు సాగించటానికి ఏడాది పట్టింది.

స్కూల్లో నీలను హేళన చేసిన పిల్లలను టీచర్లు దండించేవారు. టీచర్లంతా చాలా ఆదరంగా చూసేవారు. కొంతకాల మయిన తరువాత పిల్లల క్కూడా నీలపట్ల ఆదరాభిమానాలు కలిగాయి.

కాని - రంగారావుగారు తన యింట్లో - నీల తరువాత పుట్టిన కృష్ణను మాత్రము సంస్కరించలేకపోయారు. ఆఖరి పిల్లవాడు శ్రీనివాసును సరి దిద్దలేకపోయాడు.

నీల స్వభావము చాలా గంభీరంగా ఉండేది. తల్లికి ఎంత సహాయం చేయాలో అంతవరకే చేసి ఇవతలికి వచ్చేది. తన చెల్లెలు తమ్ముళ్లపట్ల ఎంత బాధ్యత వహించాలో అంతే వహించేది. ఇంటి పనులయినా అంతే.

కృష్ణ హేళనలను ఒక్కొక్కరోజు ఎదుర్కొనలేకపోయేది. అటు వంటి సందర్భాలలో ఆమెకళ్లు చెమర్చేవి. అక్కడినుండి వెళ్లిపోయేది సమాధానంగా.

తల్లిది తటస్థభావము. ఆమెకు ఈ సమస్యలను పరిష్కరించగల శక్తిలేదు. చూస్తూ ఊరుకునేది.

కాలంతోపాటు మనసు కూడా ఎదిగింది. యౌవ్వనం ఆమెలో మరి కొంత చోటు చేసుకుంది ఆశలు ఆమె మనసులో చిగురురిస్తూ మాడి పోయేవి. ప్రకృతి సిద్ధంగా ఆ ఈడులో ఉన్నపిల్లల ఉత్సాహపుపొంగులు ఆ చిన్నారి హృదయంలోనే అణగి పోతున్నాయని తండ్రికి తెలుసు. ఆమె దైన్యపు చూపులు చూసి తల దించుకునేవాడు. ఆమెను గురించి ఆలోచిం చిన కొద్దీ కడుపు చెరువయ్యేది.

ఇక ఆలోచించలేకపోయా డాయన.

"అమ్మా నీలా! లేచి మరొక మాత్ర వేసుకొని కాఫీ తాగమ్మా." తండ్రి ఆమెను లేపి మాత్రవేసి కాఫీ తాగించి,

"నీలా, నేను ఆఫీసుకు వెళ్లనా? ఇవాళ తొందరగా వస్తాను." మనసు నీల దగ్గరపెట్టి ఆయన శారీరకంగా ఆఫీసు పని చేస్తున్నాడు.

నాలుగు రోజులయినా నీల జ్వరం తగ్గలేదు. రంగారావు గారి మనసు పరిపరి విధాల పరుగులు తీస్తున్నది. నీల తనకు పెళ్లి కాలేదని బెంగపెట్టుకున్నదా?

అదికాదని ఆయన మనసు కొట్టిపారేసింది.

ఏది కారణమయినా జ్వరము జ్వరమే కదా.

దానికి చికిత్స కావాలి.

పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ వెళ్లి డాక్టర్ని తీసుకువచ్చాడు.

నాలుగు రోజులనుండీ జ్వరం అంటిపెట్టుకుని ఉండటంవల్ల నీల ముఖం నీరసించింది. డాక్టరు టెంపరేచరు చార్టు చూసి రోగిని పరీక్షించాడు.

"ఇది టైఫాయిడ్. ఈ మాత్రలు వాడండి. నేను రాసిచ్చినట్టుగా ఆహారం ఇవ్వాలి... మాత్రలవల్ల టెంపరేచరు తగ్గినా ఈ మాత్రలు వాడుతూ ఉండాలి. ఈ పథ్యమే ఇవ్వాలి. నేను రెండురోజుల కొకసారి వచ్చి చూస్తాను. ఈ లోపల అవసరమనిపిస్తే పిలవండి" అన్నాడు డాక్టరు. ఆ డాక్టరికీ తెలుసు నీల సమస్య. అందుకే ఆమెపట్ల జాలీ, వాత్సల్యమూను.

"అంతా సవ్యంగా ఉంటే నీలను డాక్టర్ని చేయాలనుకున్నాను." అన్నాడు రంగారావుగారు.

"అదెట్లా జరుగుతుంది? సర్జను కాని డాక్టరు ఆపరేషను చేశాడు అనాగరీకంగా" ఆయనకెంతో బాధ కలుగుతుంది ఈ సంగతి తలుచుకున్నప్పుడల్లా.

# 7

నీలకు జ్వరం వచ్చి పదిహేను రోజులు దాటింది. ట్రీట్‌మెంటు సాగుతున్నది. రంగారావుగారు ఇంట్లో ఉన్నంతవరకూ నీల పడక దగ్గరే కూర్చుని ఆమెతో ఏవో కబుర్లు చెబుతూ ఉంటారు... ఆయన ఆఫీసు వేళల్లో అనసూయమ్మ కూర్చునేది.

రామూ పరీక్షలయ్యాయి. రఘును అన్న వచ్చి ఆ మరునాడు తీసుకువెళ్తానని చెప్పాడు. పరీక్షల భారమూ భయమూ తీరగానే పిల్లలు స్వేచ్ఛగా ఆడుకోవటం మొదలుపెట్టారు.

మరునాడు ఉదయం సత్యం వచ్చేసరికి రంగారావుగారు ఇంట్లో లేరు. అనసూయమ్మ వంట యింట్లో ఉంది. రామూ రఘూ నీలదగ్గర కూర్చుని పత్రికలో బొమ్మలు చూస్తున్నారు.

సత్యం వచ్చి గడపదగ్గర నిలబడి గదిలోకి తొంగిచూశాడు. నీల గోడపక్కకు తిరిగి పడుకుని ఉంది. పిల్లలు ఆమెకు నిద్రా భంగము కాకుండా మెల్లగా మాట్లాడుకుంటూ పత్రిక చూస్తున్నారు.

సత్యాన్ని చూడగానే రఘు లేచి వచ్చాడు. తన సామాను సర్దుకున్నాడు. వెళ్ళేటప్పుడు సత్యం అనసూయమ్మ గారికి చెప్పాడు.

ఆమె రఘును భోజనంచేసి వెళ్ళమన్నది. నీల సంగతి చెప్పి "ఈ పదిహేను రోజులనుంచీ బెంగగా ఉంది సత్యం. కాళ్ళూ చేతులూ ఆడటంలేదు. ఆయన బొత్తిగా పిచ్చివారిలా మారిపోయారు" అన్నది.

"చెప్పండి - మీకు ఏ సహాయం కావలసివచ్చినా కాకిచేత కబురంపితే నేను వస్తాను. ముఖమాట పడకండి. లేకపోతే మా యింట్లో అద్దెకున్న అబ్బాయి ఆనంద్ అని ఉన్నాడు. అతడుకూడా చాలా మంచివాడు. సరదా మనిషి. ఈసారి వచ్చేటప్పుడు వెంట తీసుకువస్తాను."

"ఆనంద్ అంటే ఆ రేడియో స్టేషనులో పనిచేస్తున్న అబ్బాయేనా? అతడయితే తెలియకేం? బాగా తెలుసు." అన్నది అనసూయమ్మ.

"అతడేనండీ"

"అతడు ఇదివరకూ మా యింటికి వస్తూ ఉండేవాడు. ఈమధ్య రావటంలేదు. ఎందుకోగాని."

"ఏం లేదండి. అతడికి రెండేళ్లు విశాఖపట్నం బదిలీ అయింది. మళ్లీ వచ్చాడులెండి."

"అలాగా! మాకా సంగతి తెలియక ఎందుకోననుకున్నాను."

సత్యం రఘును తీసుకుని వెళ్లిపోయాడు.

సత్యంతో తల్లి మాట్లాడిన మాటలు మేలుకునే ఉన్న లీల చెవినబడ్డాయి.

'ఆనంద్ ఇక్కడే ఉన్నాడా?' అతడి పేరు వినగానే ఆమెకు పారవశ్యము కలిగింది.

ఈ జ్వరం రాకముంధు ఆమెకు అతడిపట్ల ఉదాసీనభావము ఏర్పడ్డది- అతడు రావటం మానేశాడని, అతడు తనను లక్ష్యపెట్టకపోతే తను మాత్రం ఎందుకు ఆరాటపడాలి?" అనుకునేది. ఇప్పుడు ఈ జ్వరంవల్ల కొంతబింకం సడలింది. అదీకాక అతడు ఇక్కడ లేడట పాపం?

ఆ సాయంకాలము తండ్రి లేకుండా చూసి, రామూని దగ్గరగా పిలిచి "ఆనంద్‌గారిని మన యింటికి ఒకసారి పిలుచుకురా" అని కాగితమ్మీద రాసి అతడి చేతికిచ్చింది.

రామూ చెప్పగానే ఆనంద్ కనుబొమలు ముడిపడ్డాయి. "సరేలే, రామూ! చూస్తాలే. నీవు వెళ్ళు" అన్నాడు.

అతడికి కృష్ణ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. ఆనంద్ తన యింటికి ఒకటి రెండుసార్లు రాగానే కృష్ణ అతడితో చొరవగా మాట్లాడబోయింది. కాని అతడు ఆమెను లక్ష్యపెట్టకుండా నీలను క్రీగంట చూడటం మొదలుపెట్టాడు. ఆమెను గురించి అడగటం మొదలుపెట్టాడు.

కృష్ణ అది చూసి సహించలేక "ఆనంద్‌గారూ! నీల మూగదండీ మూగది. అంతేకాదు కుళ్లు మనసు. అందం చూసి మోసపోకండి. పైపై మెరుగులు చూసి భ్రమపడకండి" అన్నది ఒకనాడు.

అదే ఆఖరు. ఆనంద్ మళ్ళీ ఆ గడప తొక్కలేదు.

రామూ రెండుసార్లు వెళ్ళాడు. సత్యం కూడా చెప్పాడు కాని- ఆనంద్ మనసు ఒప్పటంలేదు. మూగపిల్ల కోరికోరి మూగదాన్ని ప్రేమించటమా? తనకేం తక్కువని? ఎందుకు? ఎక్కడా పిల్లలే కనబడరా ప్రేమించటానికి?

ఆమె పేరు వింటేనే అతడికి ఏవగింపుగా ఉంది.

అయినా అదేమిటి? ఆమెను తనొక్కసారే చూశాడు. ఆ చూసినప్పుడయినా వికటంగా నవ్వాడు గాని- ఒక ఆడపిల్ల వంకచూసి నవ్వే సమ్మోహనాస్త్ర తుల్యమైన నవ్వుకాదే?

అతడు వెళ్లలేదు. వెళ్లదలచలేదు.

"రాముా! ఆయన కలవలేదా?" కాగితమ్ముక్క అడ్డం పెట్టుకుని నీల అడుగుతునే ఉంది.

"పిలిచి చీటీ ఇచ్చానక్కా! వస్తానన్నారు. ఆఫీసులో పని ఎక్కువగా ఉందట. నైట్ డ్యూటీ కూడా చేస్తున్నారట అప్పుడప్పుడు. తీరిక దొరగ్గానే వస్తానన్నారు. తప్పక వస్తారక్కా" రాముా ఈ మాటలే అటు తిప్పి ఇటు తిప్పి చెబుతున్నాడు.

నీలకు ఆశ చావలేదు. నిశాశ తొంగి చూడలేదు.

"వస్తారు. వస్తారు. అయినా ఆయనతో మాట్లాడేటంతగా తనమాట ఇంకా మెరుగు కాలేదు. పాట ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. ఇంకా ఎ.తో సాధన కావాలి" అనుకుంటుంది నీల.

అనసూయమ్మకు రాముా చెప్పాడు. ఆమె అంతగా పట్టించుకోలేదు. తండ్రికి చెప్పాడు. ఆయన క్రుంగిపోయినట్టు కనబడ్డాడు.

అందుకా నీల ఎప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్టు కనబడుతుంది? అమాయకమైన ఆ హృదయంలోని వేదన ఇదా? హృదయానికేం తెలుసు ప్రేమించటం తప్ప? లౌకిక వ్యవహారాలెన్నో ప్రేమించిన హృదయాలను ముక్కలు చేయటానికి ఉంటాయని తెలియదు.

చెమర్చిన కళ్ళను తువాలతో అద్దుకున్నారాయన.

## 8

నీల జ్వరం తగ్గిపోయిన తరువాత ఆరోగ్యస్నానం చేసింది. విటమిన్ ఇంజక్షన్లు తండ్రి బలవంతమ్మీద తీసుకున్నది. వెనుకటి నీల అవగానే డ్యూటీలో చేరింది.

స్కూలుకు వెళ్లగానే ప్రిన్సిపల్ ఆప్యాయంగా పలకరించింది. పిల్లలంతా చుట్టుకున్నారు. చంపకం కౌగలించుకుని "మళ్ళీ వచ్చావు. ఆరోగ్యంగా ఉంటేనే వస్తూండు. చాలా చిక్కావు. జుట్టంతా ఊడిపోయింది. నిన్ను చూస్తే నాకెంతో సంతోషంగా ఉంది. నీవు లేనప్పుడు నేను స్కూలుకు వస్తే ఒంటరిగా ఉన్నట్టు బాధపడేదాన్ని" అన్నది.

"స్కూల్లో తనను తలుచుకునే వారున్నారు. తన ఆరోగ్యం బాగు పడాలని ఆశించే వారున్నారు. తను రాకపోతే బాధపడే వారున్నారు. ఈ సంగతి తలుచుకుంటేనే నీల కెంతో సంభ్రమంగా ఉంది

ఆ చిగురించిన ఆశ- ఆ నూతనోత్సాహము ఆమె వ్యధిత హృదయానికి తిరిగి జీవం పోశాయి.

అనసూయమ్మ కృష్ణకు ఉత్తరం రాసింది. నీలకు టైఫాయిడ్ జ్వరం వచ్చినట్టూ, తగ్గిపోయి మామూలుగా తిరుగుతున్నట్టూను.

"నీలక్కకు సంబంధం కుదిరిందా? అయితే పెళ్ళి ఎప్పుడు? పది రోజుల ముందరగా రమ్మని నాకు రాయండి. నేను వచ్చి పెళ్ళి పనులు చేస్తాను మర్చిపోకండి" అంటూ జవాబు రాసింది కృష్ణ.

"సరేలే. నీలకు జ్వరం తగ్గిందని రాస్తే పెళ్లి సంగతి ఎత్తుతుం దేమిటి? అయోమయం పిల్ల" అనుకున్నారు తల్లీతండ్రీ.

నీల యథాప్రకారం తన ప్రోగ్రాములు తప్పకుండా చూసుకుంటోంది. గొప్ప గొప్ప గాయనీగాయకుల పాటలు రికార్డుచేసిన టేపులను చంపకం తెచ్చి యిస్తే అవి పెట్టుకుని వింటూ ఉంటుంది. అందరివీ తలా ఒక రకం బాణీలు. వాటిని గ్రహించి చేతచిక్కించుకోవాలన్న ఆరాటంగా ఉన్నదామెకు. ఒక్కొక్కరి మాదిరిగా ఫిడేలు వాయించి చంపకానికి వినిపిస్తూ ఉంటుంది.

"నీలా! నీవు ఏ ఒక్కరినీ అనుకరించకు. నీకంటూ ఒక బాణీని రూపొందించుకో" అంటుంది చంపకం.

"ఇంకా నేనా స్థాయికి రాలేదుగా!" రాసి చూపిస్తుంది నీల.

"నీ మాటలు ఎంతవరకూ వచ్చాయి? ఇంకా కాగితం సహాయం కావాలా?" అంటుంది చంపకం.

"అవును. పాటా- మాటా ఇంకా పైస్థాయికి చేరుకోవాలి." ఆమె నవ్వినా ఆ నవ్వులో ఎంతో పట్టుదల కనబడుతుంది.

రామూ పదవక్లాసు ప్యాసయ్యాడు. ఇంటర్‌మీడియేట్‌లో ప్రవేశించాలి. ఆనాడు నీల రాముకు కొత్త బట్టలు కొని స్వీట్సు తెచ్చింది. ఎంతో సంబరపడుతున్న నీలకు రామూ అంటే తగని యిష్టం.

"రామూ! నీవు పెద్దవాడివయిన తరువాత నీలక్క జ్ఞాపకం ఉంటుందా?" అని కాగితం ద్వారా అడిగింది.

ఆలా నీల అడగగానే ఏడుపు వచ్చినట్లయ్యేది రామూకి. కాని- ఈసారి ఆమె అడగగానే నవ్వేశాడు.

"ఆలా ఎందుకడిగావు?"

"ఎందుకంటె ఏమని చెప్పను? నేనా మాటలురాని మూగదాన్ని. నీకు ఇటువంటి అక్క ఉందంటే అవమానంగా ఉండదూ? చూడు. కృష్ణ నన్ను తలుచుకుంటోందా? దానికసలు చిన్నప్పటినుంచీ నన్నుచూస్తే అహస్యం. నిజం కాదంటావా?" కాగితమ్మీద రాసింది.

"అక్కా! నేనటువంటివాడిని కాను." రామూకి ఆనాటి ఆనంద్ ప్రవర్తన జ్ఞాపకం వచ్చింది. కళ్లు ఎర్రబడ్డాయి. అందరి హేళనలకూ అక్క మనసు ఎంత గాయపడుతున్నదో? ఆమె మనసు వెన్న. ఏ కరుకు

మాటయినా కసుక్కున దిగబడుతుంది. దెబ్బతిన్న పిట్టల్లా విలవిల్లాడి పోతుంది.

రోజులు నెలలుగా సంవత్సరాలుగా దొర్లిపోతున్నాయి.

నీలలో పట్టుదలకూడా బాగా ఎక్కువవుతున్నది. సాధన బాగా చేస్తున్నది.

ఆమె ఎదలో ఆశ- ముందెప్పుడో తనకు మంచిరోజు- తన కలలు ఫలించే రోజు వస్తుందన్న ఆశ. అది దగ్గరలోనే ఉన్నదని నిరీక్షణ.

ఆ ఆశ ఇంతా అంతా కాదు కొండంతది.

రాము ఇంటర్లో ప్రవేశించేటప్పుడు ఎంట్రెన్సు పరీక్ష లేదు. "రామూ! నీకే కోర్సు చదవాలని ఉంది?" నీల అడిగింది.

"నాకా? ఇంజనీరింగ్ కోర్సు చదవాలని ఉంది. కాని- నాన్న కంతగా ఇష్టంలేదు. ఎందుకో తెలియదు."

"నీకంత ఇష్టం ఉంటే నేను నాన్నకు చెప్తానురా."

"చెప్తే ఏం లాభం? వీడికింత డబ్బు ఖర్చుచేస్తే ఎలా? ఇంకోడు లేడా చదువు చెప్పించటానికి? అంటారు." ఏడుపు ముఖం పెట్టాడు.

"అబ్బా! ఏడుపుముఖం పెట్టకురా నాయనా! ఎంత డబ్బయినా నేను ఇస్తానుగా. చదువుకో. సరేనా?"

"నిజంగానా అక్కా? నిజంగా?"

"నిజంగా రామూ నిజంగా"

రామూకి కొండెక్కినంత సంతోషం కలిగింది. చప్పట్లు కొడుతూ ఎగిరి గంతులు వేశాడు.

ఆరాత్రి భోజనాలయిన తరువాత తండ్రితో చెప్పింది.

"అమ్మా నీలా. మనకింకా ఇల్లూ వాకిలీ లేదు. అంత పెద్ద చదువు పైన పెట్టుకుంటే ఎలాగమ్మా? అన్నట్టు శ్రీనివాసు ఉన్నాడు. ఇంకా, వాడూ చదువుకోవాలిగా ?"

"నాడబ్బు ఇంతవరకూ మీరు ముట్టుకోలేదు. ఇదిగో నాపాస్ బుక్. వాడి చదువు కాగా ఇంకా మిగులుతుంది. నేనేం చేసుకుంటాను ఈ డబ్బును? రామూను చదువుకోనివ్వండి" రాసింది.

నీల యిప్పుడు చిన్నచిన్న కాగితమ్ముక్కలమీద రాయటం మానేసింది. ఒక తెల్లకాగితాల పుస్తకంలో ఒక పెన్సిలు పెట్టి ఎప్పుడు దగ్గరే ఉంచుకుంటుంది అవసరము వచ్చినప్పుడు దానిమీద రాసి చూపిస్తున్నది. తండ్రి చేతికి పుస్తకం ఇవ్వగానే ఆయన అది మాత్రమే చదవకుండా పుస్తకమంతా తిరగవేశాడు. ఒక్కొక్క పేజీ తిరగవేస్తూ నీల ఎవరెవరితో ఎట్లా మాట్లాడింటో చదివాడు.

తన ఎదుట గంభీరంగా ఉండే నీల మనోగతము ఇదంతా.

ఆయనకు ఆశ్చర్యమూ విచారమూ రెండూ కలిగాయి.

ఆమె మనసు ఎంత సున్నితమైనది?
ఆమె వ్యథ ఎవరూ తీర్చలేనిది.

సాధన వల్ల ఎప్పటి మాదిరిగా మాట వస్తుందనుకోవటం వెర్రితనం. కాని- మనిషి ఆశతోనే బ్రతుకుతాడు. ఆశలేనిదే జీవించలేడు.

కాని- ఇంతవరకూ ఆశల దీవిని ఏ జీవిత నౌకయినా చేరుకుందా? ఎవరిదయినా ఎప్పటికయినా తీరం చేరుకుంటుందేమో గాని నీలది చేరటం దుర్లభం.

ఆయన ఆ పుస్తకం చేత పట్టుకుని ఇంక పేజీలు తిప్పలేక పోయారు. అక్షరాలు అలుక్కు పోయినట్టు ఆయన కళ్లకు కనబడ్డది. కళ్లనిండా నీళ్ళు. "పరమేశ్వరా, ఇటువంటి బాధ శత్రువులకయినా వద్దు"

నీల ఇదంతా చూస్తోంది. "తండ్రి విపరీతంగా బాధపడుతున్నాడు. తను కన్నవారిని కూడా ఇబ్బంది పెడుతున్నది. వాళ్లను కన్నీరు కార్చే టట్టు చేస్తున్నది. రామూ తన డబ్బుతో చదువుకుంటే కొంత వరకయినా కన్నవారి ఋణము తీరుతుంది. ఇంతకు తప్ప మార్గంలేదు. ఇంతవరకూ తనవల్ల దుఃఖమేగాని సుఖంలేదు వాళ్ళకు" గోడకు చేరబడ్డది.

# 9

స్కూలు ప్రిన్సిపల్ మిస్ రాబర్టు జేమ్సును ప్రేమించింది. నాలు గయిదుసార్లు ఎంగేజ్‌మెంటు వరకూ వచ్చి ఆగిపోయింది. ఆమె ఈసారి గట్టి పట్టుబట్టింది. ఎంగేజిమెంటు చేసుకుని ఎక్కడికయినా వెళ్లమని.

జేమ్సు క్రైస్తవ మిషనులో ఉద్యోగి. ఎప్పుడూ, ఇటూ, అటూ తిరుగుతూ ఉంటాడు. తనకు నిలకడగా ఒకచోట ఉద్యోగం దొరికితే అప్పుడు పెళ్ళి చేసుకుంటానంటాడు.

"అదెప్పుడు దొరుకుతుందో ?" అంటుంది మిస్ రాబర్టు.

"దొరుకుతుంది త్వరలోనే ఇంతలోనే అంత నిరాశా ?" అంటాడు జేమ్సు.

"పోనీ అంతవరకూ ఎంగేజిమెంటయినా అయితే బాగుంటుంది."

"ఎంగేజిమెంటయిన తరువాత పెళ్ళికాలేదన్న బాధ కలుగుతుంది" అంటాడు జేమ్సు.

ఆమె కామాటలు తృప్తి నివ్వవు.

జేమ్సుకు బొంబాయి వెళ్లి రెండునెలలు ఉండవలసి వచ్చింది. మిస్ రాబర్టు సెలవుపెట్టి తనూ వస్తానంది. ఆమెకు తనవెంట వస్తే

ఎవ రేమనుకుంటారోనని జేమ్సుకు భయం - ఒక్కొక్కసారి ఇటువంటి సందర్భాలలో ఉద్యోగాలు కూడా పోతాయి. ఆ సంగతే ఆమెతో చెప్పాడు.

ఆమెకు ఇంకా బాధ కలిగింది ... ఆమె అంతకంటె అతడిని బలవంతం చెయ్యలేదు.

అతడికీ బాధగానే ఉంది. ఆ ఉద్యోగం పోతే మళ్లీ దొరకటం కష్టం మరి.

ఉద్యోగధర్మం వాళ్లిద్దరినీ కలవనియ్యటంలేదు.

అతడు ఆ క్రిందటిరోజే వెళ్లిపోయాడు. ఆమె దిగాలు పడి కూర్చుంది.

ఆరోజు ఇంటర్‌వల్ సమయంలో ప్రిన్సిపల్ నీలను తన ప్రైవేటు రూములోకి రమ్మని పిలిపించింది. ఇద్దరూ కలిసి భోజనం చేశారు. తరువాత మిస్ రాబర్టుకు సిగరెట్ తాగే అలవాటు నీల ఎదురుగా సిగరెట్ తాగటం ఇష్టంలేదు. పైగా ఆమె తనకెదురుగానే కూర్చుంది. అలవాటు తొందర పెడుతుంటే చేతులు వెనక్కి పెట్టుకుని ఇటూ అటూ తిరగటం మొదలుపెట్టింది.

నీలకు ఆమె వాలకం చూస్తె ఏదో కొత్తనిపించింది. పైగా అసహజమనిపించింది కూడా.

"మేడమ్, ఏమిటి అలా తిరుగుతున్నారు? నాతో ఏమయినా చెప్పాలనుకుని చెప్పలేకపోతున్నారా?"

"అదికాదు నీలా! నీవేమనుకుంటావోనని జంకుతున్నాను. భోజనం చేసిన తరువాత సిగరెట్టు అలవాటయింది నాకు. అలవాటయినది వేళకందకపోతే తోచదు కదా?" పర్మిషను ఇవ్వమని అడుగుతున్నట్టుంది ఆమె ముఖం.

"మేడమ్! మీ అంతస్తు ఏమిటి? నా అంతస్తెక్కడ? మీకు నా దగ్గర జంకేమిటి? నేను మీ సబార్డినేట్‌ను. మీరు యధేచ్ఛగా ఉండచ్చు. మీ కా అధికారముంది."

"అయితే నీవు ఈ పాటలు ఈ ఆర్గన్‌మీద వాయించుతూ ఉండు. ఈ పుస్తకం మొన్ననే జేమ్సు కొనితెచ్చాడు. ట్యూన్సు నీకు తెలుసుగా?" కొత్త పుస్తకం చేతికిచ్చింది.

నీల వెంటనే ఆర్గన్ ముందర కూర్చుని కొత్త పాట ప్రాక్టీసు చేయటం మొదలుపెట్టింది

సిగరెట్ ముక్క ఏష్ట్రేలో పడేస్తూ, తానొక స్టూలు మీద కూర్చుంది మిస్ రాబర్టు. నీల సాధన చేస్తున్న పాటను అందుకొని పాడటం మొదలుపెట్టింది. ఆమె ఎంత ఉత్సాహంగా పాడుతున్నదో నీలకూడా అంత ఉత్సాహంతో వాయించటం మొదలుపెట్టింది.

"మేడమ్! ఈ పాట బాగా ప్రాక్టీసు చేసినట్లుగా పాడేస్తున్నారు. మరికొత్తగా కొన్న పుస్తకమని చెప్పారు?" ఆమెను అభినందిస్తూ రాసిన చీటీ చేతిలో పెట్టింది నీల.

మేడమ్ ముఖంలో మెరుపులా మెరిసిన ఆ మందహాసంలో సిగ్గు దొంతరలు ఎలా ఒదిగిపోయాయో? ఎంతసేపయినా దాన్నే చూడాలనిపించింది నీలకు. మిస్ రాబర్టు ముఖం ఎప్పుడూ ఇలాంటి మందహాసంతో వెలుగులు చిమ్ముతూ ఉండాలని మనసారా కోరుకుంది నీల.

రెండు పాటలు వాయించిన తరువాత, "మేడమ్! ఇంటర్‌వల్ అయిపోయింది. మరి సెలవా నాకు?" చేతిసైగలు చేసింది నీల.

"ఉండు- ఉండు. నీకూ నాకూ ఇంటర్‌వల్ ఏమిటి? అది టీచర్లకూ, పిల్లలకూ గాని నీకూ నాకూ కాదు." అని చెయ్యి పట్టుకుని కూర్చోబెడుతూ, "కొత్త పాటలు ఎప్పుడు ప్రాక్టీసు చేశారని కదా అడిగావు. ఈ పుస్తకం తెచ్చి నాకిచ్చినప్పుడు జేమ్సు పాడి చూపించాడు. అతడు క్వార్టర్సులో ఒక ఆర్గన్ ఉంది. వ్రాయిస్తూ పాడాడు. నాక్కూడా నేర్పించాడు. ఈ పాటల్లో కొన్ని ఇద్దరం ప్రాక్టీసు చేశాము" అన్నది ఆనందాతిరేకంతో.

"ఓహో! అదా సంగతి?" మురిపెంతో చూసి "ఎంత అదృష్టవంతులు మీరు మేడమ్!" అని మరొకసారి అభినందించి వెళ్ళుతున్నట్టుగా చెప్పి తనగదికి బయలుదేరింది.

"ఇలా ఆనంద్ నేనూ కలిసి పాటలు ప్రాక్టీసు చేసే రోజు ఎప్పుడయినా వస్తుందా? ఆనంద్ పాడుతుంటే తాను వాయించేరోజు తన జీవితంలో ఎప్పుడయినా ఎప్పటికయినా తటస్థపడుతుందా?

మిస్ రాబర్టు అన్నివిధాలా అదృష్టవంతురాలు. అతడి పేరు చెప్పగానే ఆమె కళ్ళల్లో ఆ మెరుపులూ ఆ తళతళలూ ఆమెకు శాశ్వతం కావాలని మనసారా కోరుకుంది నీల.

ఆ జంటలా తామిద్దరూ కూడా జంట అయితే?

ఇద్దరి మనసుల్లోనూ ప్రేమ రగిలితేనే తహతహ పుట్టుకొస్తుంది కాని- ఇది ఏకపక్షజనితం. కనుకనే ఆలస్యం.

కళ్లు చేతివేళ్లతో మూసుకుంది. ఎంత సేపలా ఉందో? చటుక్కున కళ్లు తెరిచింది. ఎదురుగా టైపురైటర్- దానిలో సగం టైపు చేసిన కాగితాలు.

ఆమెకు తన డ్యూటీ జ్ఞాపకం వచ్చింది. దాన్ని ఏమారిచి ఆలోచనలో పడిందా? ఇంకెప్పుడూ ఇలా జరక్కూడదు. ఒకరికి చెప్పవలసింది పోయి, తానే అలా చెయ్యటం తప్పుకాదా? చేతివేళ్ళతో సన్నగా చెంపలు రాయించుకుని, మైపు చెయ్యటం మొదలు పెట్టింది.

బుర్రలో ఊహలు పరుగెత్తుతున్నా నిగ్రహం తెచ్చుకుని తనపని సాగించుతున్నది. మధ్యలో ఒకసారి, అయ్యో ఇవాళ చంపకంతో చెప్పాలి- ఇవాళ పాటలు ప్రాక్టీసు చేయటానికి వీలులేకపోయిందని. ఆమె తనను క్షమిస్తుందన్న నమ్మకం ఉన్నది. కాని తన అంతరాత్మ? అది క్షమించదు. దానికి కళ్ళూ చెవులూ లేవు. ఏక దీక్షతో తను చెప్పినట్టుగా నడుచుకోమనటం ఒక్కటే ఆజ్ఞ- తిరుగులేని ఆజ్ఞ.

అవును. ఒక్కనాడయినా విడవకుండా ఆరాధించే కళామతల్లికి తాను అపరాధం చేసినట్టే కదా! తన తప్పులను వెదకి పట్టుకుని తనకు వాటిని ఎత్తిచూపించేదీ- ఇకముందు అలా చేయవద్దని శాసించేది అంతరాత్మే కదా! అది చెప్పినట్లు నడుచుకోవటం తన విధి.

# 10

జనవరి మొదటి తేదీనుండి పదవ ఫిబ్రవరీ వరకు హైదరాబాదు నగరంలో ఎగ్జిబిషను జరుగుతుంది. ఆ వస్తువులలో భారతదేశంలో తయారయే వస్తువులన్నీ ఒక్కొక్క స్టాల్లో ఒక్కొక్క ఊరిలో తయారయిన సరుకు ఉంటుంది. క్రమంగా దీనిలో నూతనాంశాలు కూడా చేర్చబడుతున్నాయి. కొత్త వ్యవసాయ పద్ధతులూ, ఆ పనిముట్లూ, దేవాలయాలూ కొత్తగా చేర్చబడ్డాయి. భారతదేశంలో తయారు కాబడిన వివిధ రకాల

చీరెలు, చేనేత, చేతిపనులు కూడా ఉన్నాయి. ఒకటికాదు - రెండుకాదు. మన దేశీయ వస్తువుల అంగళ్లన్నీ హైదరాబాదు వస్తుప్రదర్శనంలో కన బడతాయి.

"రామూ! ఎగ్జిబిషనుకు పోదామా? నా కివాళ సెలవు. మీ క్రికెట్ మాచ్ అయిందిగా. రా పోదాము." నీల మధ్యాహ్నం టీ తాగగానే రామూకొక చీటీ ఇచ్చింది. ఎగ్జిబిషను సాయంకాలము ఐదు గంటలకు మొదలవుతుంది. తల్లికి చెప్పి ఇద్దరూ బయలుదేరారు.

నీలా రామూ ఒకరి చెయ్యి ఒకరు పట్టుకుని టికెట్లు కొనుక్కుని, లోపలికి వెళ్లి ఒక్కొక్క దుకాణమే చూస్తూ నడుస్తున్నారు. మన దేశంలో ఎన్ని వస్తువులు తయారవుతున్నాయో అనుకుంటూ చూస్తూ నడుస్తున్నారు. దారిలో కనబడ్డ పరిచయస్థులనూ స్నేహితులనూ పలక రిస్తూ ముందుకు నడుస్తున్నారు.

ఒకచోట నీల చటుక్కున ఆగిపోయింది. ఒక దుకాణంలో జేమ్సూ మిస్‌రాబర్టూ బట్టలు చూస్తున్నారు. ఆయన వెంబడి ఉన్నప్పుడు మిస్ రాబర్టును పలకరించకూడదనుకుంటూ ముందడుగు వేసింది. చంపకం ఆమె పెనిమిటి శివరామ్ పిల్లలను కూడా తీసుకువచ్చారు.

మోయలేనన్ని సామాన్లు సంచుల్లో వేసుకుని భుజానికి తగిలించు కున్నారాయన. చంపకం నీలను చూసి భుజం తట్టి "మేము వెళ్లిపోతు న్నాం. పిల్లలు చూసినవన్నీ కొనమంటున్నారు. అక్కడికీ ఎన్ని కొన్నామో చూడు. రంగులరాటం ఎక్కడమయింది. ఎలక్ట్రిక్ రైలు ఎక్కి తిరగటమయింది. తినుబండారాలు తినటమయింది... పర్సు ఖాళీ అయింది. ఇంటికి ఆటోలో వెళ్లటానికి డబ్బులేదు. బస్సులో వెళ్లాలి" అన్నది పిల్లలనూ ఆయననూ మురిపెంగా చూస్తూ.

నీల నవ్వింది.

రాముకి ఇద్దరు ముగ్గురు స్నేహితులు కలిశారు. అక్కతో విడిపోతే ఆ జనంలో తిరిగి కలుసుకోవటం కష్టం. అందుకని ఆమె చెయ్యి పట్టుకునే ఉన్నాడు.

"అక్కా! మిరపకాయ బజ్జీలు తిందామా?"

సరేనన్నట్లు ఆమె తల ఊపింది. "ఇక్కడే నిలబడు. నేను తెస్తాను" బండీ దగ్గరకెళ్లి డజను బజ్జీలు కొన్నాడు. కారం పుట్టగానే ఐస్క్రీమ్ కొనుక్కుని వచ్చాడు. చిన్నపిల్లల్లా సంబరపడుతూ ఇద్దరూ తిన్నారు. మళ్ళీ నాలుగడుగులు వెయ్యగానే కాశ్మీర్‌స్టాలు వచ్చింది.

"అక్కా కుడివైపుకు తిరగాలి" అంటూ ఆమెను పక్కకు తిప్పాడు.

నీల అక్కడే నిలబడిపోయింది. సంవత్సరాల తరబడి ఎవరికోసం చూస్తున్నదో అతడు కాశ్మీర్ స్టాల్లో బట్టలు చూస్తున్నాడు. ఆమె అతడిని పక్కవాటుగా చూసింది. అతడిని ఎదుటబడి చూడాలనీ, కళ్లతో పలకరించాలని ఆమె మనసు ఆరాటపడటం మొదలు పెట్టింది. ఆమె కళ్లలో ఆరాధనా భావం, ప్రేమ, దర్శనం కోసం ఆలమటింపూ ముఖంలో ద్యోతకమవుతున్నాయి.

రామూ చెయ్యిపట్టి లాగుతున్నాడు, అక్కను పక్కకు రమ్మనమని.

మరికొంతసేపు అక్కడే నిలబడి ఉంటే అతడి ముఖం కనబడుతుందేమోనన్న ఆశతో ఆమె కదల్లేదు.

"అక్కా, ఇటు ఇటు" రామూ బిగ్గరగా పిలుస్తూ చెయ్యి లాగుతున్నాడు.

ఆమె చెయ్యి విదిలించుకున్నది

"ఏమిటక్కా- చీకటి పడిపోతున్నది. అటువైపుకూడా చూద్దాముర తొందరగా నడు" నీల చెయ్యిపట్టుకుని లాగుతూ పక్కకు తిరిగాడు.

"అక్కా- ఆనంద్ అడుగో. చూడు" అంటూ బిగ్గరగా పిలిచాడు.

ఆనంద్ గబగబా అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళుతున్నాడు.

రామూ పిలుపు విని- పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు.

"అక్కా. నీవు చూశావా ఆనంద్‌ను ?" ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు రాము.

చూశానన్నట్లు తల ఆడించింది నీల మాడిపోయినట్లున్న ముఖంతో. ఇంకా ఆమె చూపులు ఆమె మొదట అతడిని చూసిన చోటనే నిలిచాయి.

ఆ తరువాత ఆమె గాజు కళ్లతో రామూ తీసుకు వెళ్లిన వైపుగా వెళ్ళింది. అతడు చూపించిన వాటిని యాంత్రికంగా చూస్తూ రామూ చెయ్యి పట్టుకుని నడిచింది. ఆకర్షణీయమైన స్టాల్సును కూడా గడ్డిపరకలను చూసినట్టు చూసింది.

"అక్కా. రిక్షాలో పోదామా ? బస్సులోనా ?"

"ఏదయినా ఒకటే" అన్నది.

"రిక్షా అయితే నాలుగురూపాయలు అడుగుతారు. బస్సయితే రూపాయన్నర ఖర్చుతో ఇంటికి వెళ్ళగలము" అక్కకు డబ్బు అనవసరంగా ఖర్చుచేయటం ఇష్టం ఉండదు అనుకుంటూ బస్టాండువైపు ఆమెను నడిపించుకుంటూ వెళ్లాడు రాము.

యాంత్రికంగా నడిచి బస్సెక్కింది నీల. మధ్యలో రామూ ఏదో ఒకటి మాట్లాడుతునే ఉన్నాడు. వింటూ కూర్చుంది.

ఆనంద్ కనబడ్డ తరువాత నీల మనిషే మారిపోయిందనుకున్నాడు రాము. అసలు అతడిని తను చూపించకుండా ఉండాల్సింది. కంటికి కన బడికూడా రాలేదు ఆనంద్. పిలిచినా తనను కానట్టు వెళ్ళాడు. దగ్గరికి వచ్చి మాట్లాడుతాడేమోనని భయపడి పరుగెత్తినట్టున్నాడు.

భయపడి పరుగెత్తాడా ?

ఎందుకు భయం ?

ఆలోచనలు తెగకముందు ఇంటికి ఏభయిగజాల దూరంలో బస్సాగింది. ఇద్దరూ నడిచి ఇంటికి వెళ్ళారు.

మౌనం అదే మౌనం నీలకు.

మరునాడు స్కూలుకు వెళ్ళేటప్పుడు పది రూపాయల నోటు రామూ చేతిలో పెట్టి గబగబా అడుగులు వేసింది. ఇది ఎగ్జిబిషన్ ఖర్చు కాబోలు అక్క ఇచ్చిందనుకున్నాడు రాము.

ఆమె అప్పటి మౌనం పదిరోజులు సాగింది.

స్కూల్లో చంపకం ఎగ్జిబిషన్ను గురించి గంటసేపు మాట్లాడింది. కళ్లు ఒప్పగించి చూసింది నీల.

మిస్ రాబర్టు జేమ్సుతో ఎగ్జిబిషన్ చూడటాన్ని గురించి వన్నె చిన్నెలుగా వర్ణించి చెప్పింది చంపకం.

"నీలా! మమ్మల్ని చూశావా? ఎక్కడ ఉండగా చూశావు? జేమ్సు ఒకచోట రెండు నిమిషాలయినా నిలబడనివ్వలేదు. ఎగ్జిబిషనంతా గిరగిరా ముమ్మారు ప్రదక్షిణాలు చేయించాడు. ఆ చాకొలెట్ ఐస్క్రీమ్? ఎంత చల్లగా, ఎంత రుచిగా ఉందో చెప్పలేను. అన్నట్టు ఏమయినా కొన్నావా ?" అడిగింది.

లేదన్నట్టు తల ఊపింది.

మిస్ రాబర్టు పట్టలేని నవ్వు నవ్వుతూ "మేమూ కొన్నాం నీలా! ఏం కొన్నామో అడక్కు. కంటికి కనబడే వస్తువులు కావు సుమా! అన్నీ తినేవే. ఇద్దరం తింటూ నడిచాం. కొన్ని నడుస్తూ తిన్నాం." మనసులో ఉన్న సంతోషమంతా చెప్తూ వ్యక్తం చేసింది.

మళ్లీ మామూలు దినచర్యలో పడ్డది నీల. కాని- ఏదో విధమైన పరధ్యానంలో మునిగిపోయినట్టు కనబడేది. దీర్ఘ తపశ్చర్య తరువాత కళ్లు తెరిచి చూసే మునిపుంగవుడిలా కనబడేది.

చంపకం దగ్గర పాట సాధన చేసేటప్పుడు మునుపటి పట్టుదల కొద్దిగా సడలినట్టు కనుపించింది.

"తప్పు వాయిస్తున్నావు ఏదో ఆలోచనలో పడ్డట్టున్నావు. బాగా గమనించి వాయించు." చంపకం హెచ్చరికలు రెండు రోజులకొకసారి వినుపిస్తున్నాయి.

ఉలిక్కిపడి "పొరబాటయింది" అన్నట్టు చూస్తుంది నీల.

"ఇన్నాళ్లనుంచీ ఒక తప్పయినా లేకుండా నేర్చుకుంటున్నావు. ఇప్పుడు నీకు వచ్చిన పాటే తప్పుగా వాయిస్తున్నావు. అయితే మళ్లీ మొదటినుంచీ నేర్చుకో." చంపకం మందలిస్తున్నది.

'సరే' అన్నట్టు తలూపుతుంది నీల.

"అయితే మొదటినుంచీ నేర్చుకుంటావా ఏం?"

విస్మయంతో చూస్తుంది చంపకం.

"ఏం నీలా? సంగీతంపట్ల ఇదివరకు ఉన్నంత తమకం కనబడ దేం? విసుగుపుట్టిందా?"

నీల జాలిగొలిపే చూపులలో దీనంగా చూస్తుంది.

ఆ రోజు స్కూలు ప్రైమయిన తరువాత నీల ముందరే జేమ్సు మిస్ రాబర్టు స్కూలు ఆవరణంలో నుంచి స్కూటరుమీద బయటికి వెళ్లారు. నీల తన పనులన్నీ పూర్తి చేసుకుని, తాళాలు వేసుకుని ఇంటికి బయలుదేరింది. స్కూలుకు రెండు బారల దూరంలో బస్సాగుతుంది. బస్సుకోసం గబగబా నాలుగడుగులు వేసింది కాని- ఆరోజు బస్సు నీల చూస్తూ ఉండగానే కదిలిపోయింది. అయ్యో అని ఆమె మనసు మూలిగింది. మరో పదడుగులు నడిచి, రిక్షా మాట్లాడుకుని ఎక్కి కూర్చుంది. ఆమెకు మిస్ రాబర్టును జేమ్సుతో చూడగానే మనసు ఉప్పొంగినట్లయింది. ఆ అరక్షణంలోనే మిస్ రాబర్టు ముఖంలో కొట్టవచ్చినట్టు కనబడే తెలుగును చూడగలిగింది.

మిస్ రాబర్టు జేమ్సు కనబడగానే లొడలొడ వాగుతుంది. అతడికి తన ప్రశ్నలకు జవాబిచ్చే వ్యవధి కూడా ఇవ్వదు. తనొక్కతే కిచకిచలాడుతుంది గంటలకొలదీ. అతడికీ తను మాట్లాడాలని లేనట్టుంది. అతడికి వినటంలోనే ఆనందం ఉంది కాబోలు.

తను ? తను మాట్లాడలేదు. కనుక వినటంలోనే సంతోషాన్ని పొందాలి. అంతే. అంతే ఏం కర్మ ? తనమాట వినటం ఇష్టమే

కాని- కాని- ఆ మాట్లాడేవాళ్లెవరు తనతో ?

వెంటనే వెనక్కు తిరిగిచూస్తూ పరుగులుతీసే ఆనంద్ కంటి ముందర ప్రత్యక్షమైనట్లనిపించింది. ఆమె కళ్ల ముందు మిస్ రాబర్టు జేమ్సు వాళ్లిద్దరి నవ్వులు- మురిపాలు- సరసాలు- ఎన్నో ఎన్నో సినిమా రీళ్ల మాదిరి తిరుగుతున్నాయి మధ్య మధ్య ఆనంద్ పరుగులు.

తలకు ఏదో దెబ్బ తగిలినట్లనిపించి, కళ్లు తెరిచాననుకుంది.

నీల యింటి సందు ముందర రిక్షా మలుపు తిరగాలి. రిక్షా మలుపు తిరగబోతుండగా విసురుగా వస్తున్న బస్సు దానిని తోసేసింది. రిక్షాలో కూర్చున్న నీల అంతదూరాన ఉన్న బండరాయి మీద పడ్డది.

రిక్షా తుక్కుతుక్కయింది. రిక్షావాడికి నడుమ్మీద దెబ్బ తగిలింది. లేవలేకపోతున్నాడు.

మూగిన జనం చుట్టూ దడి కట్టారు.

రంగారావుగారు ఆఫీసునుంచి వస్తూ, అక్కడ చుట్టూ చేరిన జనాన్ని "ఏమయింది? ఏమయింద"ని అడిగారు ఆందోళనతో. ఎందుకంటే అక్కడే బస్సాగుతుంది. దానిలో జనం పల్చగా ఉన్నారు. పైగా చెడిపోయిన రిక్షా కనబడుతోంది.

"టక్కరయిందండీ. బస్సు రిక్షాను కొట్టేసింది" అంటున్నారు జనం.

నీల ఇంటికి వచ్చే సమయమది. బస్సుకూడా ఆగి ఉంది. ఆయన గుండె దడదడ లాడింది. జనాన్ని ఒత్తిగించుకుంటూ వెళ్లితే తలలోనుంచి రక్తం కారుతున్న నీల కనిపించింది.

ఎవరయినా వెళ్లి ఒక టాక్సీని తీసుకురండి. ఆయన కేకలు పెడుతూ నీల తలను రక్తం కారకుండా ఒత్తి పట్టుకున్నారు. ఆగుంపులో మరొక మనిషిని పిలిచి ఇంటికి కభురు చేశారు.

ఆ సమయానికి రామూ ఇంట్లో లేడు. అనసూయమ్మ గుండె బాదుకుంటూ వచ్చింది. టాక్సీ రాగానే హాస్పిటల్లో చేర్చారు.

అక్కడ నీలి తలకు కుట్లువేసి కట్టుకట్టారు. రక్తం చాలా పోవటంచేత కొత్తరకం ఎక్కిస్తున్నారు.

ఆనాడూ మరునాడూ కాదు- మూడోనాడు కన్ను తెరిచింది నీల. అదికూడా మెలకువ వచ్చి చూసే చూపుకాదు. ఆ చూపు ఎటో చూస్తున్నట్టుంది.

తల్లీ తండ్రీ నిద్రాహారాలు లేకుండా ఆ మంచం దగ్గర పడిగాపులు కాస్తున్నారు. రామూ వాళ్లకు కావలసిన కాఫీ టిఫిన్లు అందిస్తున్నాడు.

అనసూయమ్మ ఆశతో నీల ముఖంలోకి చూస్తూ కూర్చుంది. తండ్రి ముఖంలో కళాకాంతులు లేవు.

"అమ్మా! మీరు ఇంటికి వెళ్లి స్నానాలుచేసి కొంచెం అన్నం వండుకుని తినిరండి. మూడురోజుల నుంచీ భోజనం లేకుండా ఇక్కడే ఉన్నారు. నాన్న ముఖం చూడమ్మా ఎట్లా ఉందో?" ఇంచుమించుగా వాళ్లిద్దరి నెట్టి పంపించాడు రాము.

నీల అప్పుడప్పుడు కళ్లు తెరుస్తున్నది కాని-మనుష్యులను గుర్తుపడుతున్నదో లేదో సరిగా తెలియదు. రబ్బరు గొట్టంద్వారా నోట్లో పోసిన పాలు పళ్ల రసాలు కడుపులోపలికి పోతున్నాయి.

రామూ మెల్లగా "నీలక్కా! నీలక్కా! చూడు. నీ వెక్కడున్నావో?" అని చెవిలో రహస్యంగా చెబుతున్నట్టుగా అంటున్నాడు. తల్లీ తండ్రీ స్నానాలుచేసి భోజనాలు కానిచ్చుకుని మధ్యాహ్నం రెండు గంటలకల్లా వచ్చారు. రాగానే డాక్టర్ని కలుసుకున్నారు.

"ఎప్పుడు కళ్లు తెరిచి మాట్లాడుతుందండీ?" జాలిగొలిపే కంఠస్వరాలతో ఒక్కసారే అడిగారు.

"తలకు దెబ్బ తగిలింది కనుక కొంచెం టైం పడుతుంది." అని అక్కడ నిలవకుండా ముందుకు వెళ్లాడు డాక్టరు.

తల్లీ తండ్రీ నీల దగ్గర కూర్చున్న తరువాత రామూ సైకిలు తీసుకుని రఘు ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో రఘు లేడు గాని సత్యం ఉన్నాడ.

"ఏమిటోయ్ కబుర్లు? బాగా చదువుతున్నావా?"

తల ఊపాడు రామూ.

"ఏమిటోయి అలా ఉన్నావేం? కూర్చో?"

"మా నీలక్కకు ఏక్సిడెంటయి తలకు దెబ్బ తగిలిందండీ ఇప్పుడు హాస్పిటల్లో ఉంది" కళ్లు తుడుచుకున్నాడు.

"ప్రమాదంగా ఉందా? ఇదెప్పుడు జరిగింది?" అదిరిపోయాడు సత్యం.

జరిగిన దంతా చెప్పాడు రాము.

"ఏమండీ ఆనంద్‌గారు ఇంట్లో ఉన్నారా?" సందేహిస్తూనే అడిగాడు.

"ఇప్పుడే వచ్చినట్టున్నాడు వెళ్ళి చూడు"

రామూ తలుపు తట్టగానే తీశాడు ఆనంద్.

"ఆనంద్‌గారూ మా నీలక్క హాస్పిటల్లో ఉందండీ. తలకు దెబ్బ తగిలి పడిపోయిందండీ" ముఖాన్ని చేతులతో మూసుకుని ఏడ్చాడు.

ఆనంద్ కొద్దిగా చలించాడు.

"ఆనంద్‌గారూ, మా నీలక్క బతుకుతుందన్న నమ్మకం నాకు లేదండీ. తలలో నుంచి రక్తం చాల పోయింది. ఇంతవరకూ బాగా కళ్లు తెరచి మాట్లాడటం లేదండీ"

కొంత సేపటికి "అసలు ఏం జరిగింది?" వినీవినబడకుండా అడిగాడు. ఏడుస్తూనే వివరాలు చెప్పాడు రాము.

"డాక్టర్లేమంటున్నారు?"

"కొంచెం టైం పడుతుందని చెప్తున్నారు. ఆనంద్‌గారూ! మా నీలక్క మిమ్మల్ని చూడాలని ఎంత కాలంనుంచో అనుకుంటున్నదండీ. మీరు ఒక్కసారంటే ఒక్కసారి రాగలరా? మా నీలక్క కోరిక కూడా మిమ్మల్ని ఒక్కసారి చూడాలని. అంతే. అంతే. రెండంటే రెండు నిమిషాలు కంటికి కనబడి వచ్చెయ్యండి. మీరు మాట కూడా మాట్లాడనవసరం లేదు. ఆమెకు తన జీవితంలో కడసారిగా మిమ్మల్ని చూసిన సంతోషం మిగల్చండి ఆనంద్‌గారూ? ఒక్కసారి రండి."

సత్యం గడప దగ్గర నిలబడి ఇదంతా చూస్తున్నాడు. ఆనంద్ ఎందుకు సందేహిస్తున్నాడో సత్యానికి తెలియటంలేదు. ఆమెకు అతడిని ఒకసారి చూడాలని కోరిక కలగటమేమిటి? ఇద్దరూ ప్రేమించుకుని విడిపోయారా? ఆనంద్ అలిగి ఆమెను చూడటం మానేశాడా? సత్యానికేమీ అర్థం కాలేదు. ఇక ఆగలేక పోయాడు. "ఆనంద్, ఇన్నిసార్లు పిలిపించుకుంటావా? ఆ అమ్మాయి రమ్మంటే ఒకసారి వెళ్ళితే తప్పా? నీ కిష్టం లేదనుకో. కడసారి చూపు కయినా ఆమె నోచుకోలేదా?

ఆనంద్‌కు నోటమాట లేదు. బిత్తరపోయి చూస్తున్నాడు.

"ఆనంద్. నేనూ వస్తాను పద. ప్రాణాపాయంలో ఉన్న పిల్లను చూడటానికి ఇంత ఆలోచిస్తావా? మనిషివి కావుటయ్యా?" గబగబా ఒంటికి బుష్‌షర్టు తగిలించుకుని ఆనంద్‌ని లాక్కుంటూ పోయి ఆటోలో ఎక్కాడు.

"రామూ! ఆసైకిలు మాయింట్లో పెట్టి నీవుకూడా ఎక్కు. నీల ఉన్న వార్డు మాకు తెలియదు. ఏహాస్పిటల్ ? చెప్పుదువుగాని మాతోరా"

రామూ ఎర్రబడ్డ కళ్లతో ఉస్మానియా హాస్పిటల్లో నీల ఉన్న వార్డుకు తీసుకువెళ్లాడు. మెట్లు ఎక్కేటప్పుడు వణకటం మొదలు పెట్టాడు ఆనంద్. అతడి ముఖం నాలుగు లంఖణాలు చేసిన ముఖంలా ఉంది. కాళ్లు తడబడుతుంటే సత్యమే చెయ్యిపట్టుకున్నాడు.

అప్పుడే డాక్టరు వచ్చి చూసి వెళ్లినట్టున్నాడు. "చార్టుమీద రాసిన ఇంజక్షను త్వరగా తెప్పించండి" అన్నాడు. ఆయన వెళ్లగానే రాత్రి డ్యూటీ డాక్టరు వచ్చాడు.

"ఏమండీ ఎలా ఉంది ?" నీల తల్లిదండ్రుల ప్రశ్నలు చాలా ఆదుర్దాగా ఉన్నాయి. వాళ్లకు జవాబు చెప్పలేక ఆలోచిస్తున్న ఇతర డాక్టర్లు ముఖాలు - తప్పించుకుని తిరుగుతున్నట్టు వాళ్ల పనులు వాళ్లు చేసుకుంటున్నారు.

నీల క్రిందటిరోజు మాదిరిగానే కళ్లుతెరిచినా మనిషిని గుర్తుపడుతున్నట్టులేదు.

ఆనంద్, సత్యం, రామూ మంచం దగ్గరికి రాగానే రంగారావుగారు కళ్లు తుడుచుకుంటూ పక్కకు జరిగారు. ఆనంద్ ఊపిరి బిగబట్టి నీలనే చూస్తున్నాడు. అతడి మనసులో ఏముందో తెలియదు. తప్పుచేసినట్టుగా చేతులు నలుపుకుంటున్నాడు.

రంగారావుగారు మెల్లగా అన్నారు - "అది నోరులేనిపిల్ల. దాని మనసులో ఏమున్నదో ఒక్కనాడయినా వ్యక్తం చెయ్యలేదు. కాని - దాని ప్రవర్తన నీమీద మనసున్నట్టు గ్రహించాను. పెళ్లి చేసుకోకపోయినా నీవు కంటికి కనబడటమే మానేశావు. నీప్రవర్తన ఎట్లా కనబడ్డ

దంటే కంటికి కనబడితే బలవంతాన పెళ్లి చేస్తామేమో అన్నట్టు అర్థమయింది. నీవు తప్పించుకుని తిరిగావు. నీకింక అటువంటి బాధలుండవు. కాని - మానవత్వమున్న మనిషిలా - అందరినీ సామాన్యంగా చూసినట్లయినా చూడు బాబూ!" అన్నాడు రుద్ధకంఠంతో. ఆనంద్ కళ్లు గట్టిగా మూసుకున్నాడు.

"బాబూ! అది అమాయకురాలు. ఒకవేళ తన లోపాన్ని గ్రహించక నిన్ను మనసులో నిలుపుకుందేమో? అంతమాత్రాన భయపడతావా? నీకు భయమేమిటి? నీకిష్టంలేకపోతే వద్దని చెప్పలేవా? చెప్పిన తరువాత కూడా ఇంకా ఆశలు పెంచుకుంటుందా? అంత అవివేకా? పెంచుకోదు. వెర్రిది కనుకనే నీ మెప్పుకోసం సంగీతం నేర్చుకుంటున్నది. అద్భుతంగా ఫిడేలు వాయిస్తోంది. నీతో మాట్లాడటం కోసం మూగబధిరాంధుల పాఠశాలకు వెళ్లి మాటలు నేరుస్తోంది. ఇంకా సాధన చేస్తోంది. అవన్నీ చూస్తుంటే మాగుండెలు గతులు తప్పుతున్నాయి. నీవు ప్రేమిసున్నావని చెప్పక్కరలేదు. ఒక్కసారి పేరుపెట్టి నీగొంతుతో పిలు. ఒక్కటే ఒక్కసారి. ఆజీవుడు లోపల ఎక్కడన్నా ఉంటే ఊఁ అంటుందేమో?" కళ్లమీద కండువా అడ్డం పెట్టుకుని ఏడ్చాడు రంగారావుగారు.

ఇక ఆగలేకపోయాడు ఆనంద్.

"నీలా! నీలా! నేను ఆనంద్‌ను, వచ్చాను చూడు. కళ్లు తెరు ఒక్కసారి" మెల్లగా చెవిలో చెప్పాడు.

కళ్లు ఏమయినా తెరుస్తుందేమోనని అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. రామూ, ఆనంద్ భుజమ్మీద తలఆనించి - "ఆనంద్‌గారూ! మా నీలక్క ఒకసారి నాకు కాగితమ్మీద రాసి చూపించిందండీ, 'మాటలో నిన్ను మించుతా సంగీతంలో, నిన్ను వెనక బడేస్తా'నని రాసి పక్కన మీ బొమ్మ వేసిందండీ, కన్నీరు కార్చాడు.

"నీలా ! నీలా ! నేను వచ్చాను చూడు" చెవిలో అంటున్నాడు ఆనంద్ రుద్ధకంఠంతో.

నీల కళ్లు తెరిచింది. ఆనంద్‌ను కళ్లారా చూసినట్టు చూసింది. ఒక చిరునవ్వు లాంటిది ఆమె పెదవులమీద విరిసినట్లపించింది చూసినవాళ్లకు. ఆనంద్ వికసించిన ముఖంతో "ఆఁ, కళ్లు బాగా తెరు" కళ్లు బాగా తెరు" అంటున్నాడు.

కాని - ఆ చిరునవ్వు ఆనంద్ హృదయంలోకి చొచ్చుకుంటూ పోయినట్లు ఆమె ప్రాణాలు దూసుకుంటూ పైకి పోయాయి.

1981 పుస్తకప్రపంచం.

(ఆంధ్రప్రదేశ్ బుక్‌డిస్ట్రిబ్యూటర్సు వారి మాసపత్రిక)